RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా నిజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:42 FRIDAY,JULY 10,2026 PAGES:12 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :42 శుక్రవారం, జూలై 10, 2026, పేజీలు -12 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై

# విచారణ జరిపించాలి

- బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత
- ఆ డబ్బులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని ఆరోపణ
- ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలో చేరనని వ్యాఖ్య



తెలంగాణ పత్రిక :బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, **మిగతా 2లో**



2

## మూసీ పునరుజ్జీవన పనులకు

# గ్రీన్ సిగ్నల్..

## చైనాలో ఘోర ప్రమాదం

**షూ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం.. 28 మంది సజీవదహనం!**

-అగ్నికీలల్లో చిక్కుకున్న వందలాది మంది కార్మికులు
-ప్రాణనష్టం మరింత పెరిగే అవకాశం ఉందన్న అధ్యక్షుడు షీ జిన్‌పింగ్
-యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న సహాయక చర్యలు

2

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

### తెలంగాణ ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టులు

-పర్మినెంట్ ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాల భర్తీ -రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండానే నియామకాలు -పదో తరగతి మార్కుల ఆధారంగా ఉద్యోగాలు 2





## జూలై 10న చింతకానిలో భారీ రైతు ఆశీర్వాద సభ

- హాజరవుతారని అంచనా.. సభకు ప్రతి రైతు హాజరై ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపు..
- 9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ..
- వ్యవసాయ, అనుబంధ రంగాల కోసం 1,67,877 కోట్లు వ్యయం..
- రైతు భరోసా, ఆశీర్వాద సభ ఏర్పాట్లపై మీడియా సమావేశం నిర్వహించిన డిప్యూటీ సీఎం

2

## హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణ

# నా కల

-యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, వెబ్‌సైట్ ప్రారంభం
-కొత్త క్రీడా పాలసీతో క్రీడారంగానికి ప్రోత్సాహం
-గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో క్రీడలు వెనుకబడ్డాయని వ్యాఖ్య
-నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న తెలంగాణ



తెలంగాణ పత్రిక : హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించడమే తన వ్యక్తిగత కల అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. క్రీడా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్?లోని గచ్చిబౌలిలో 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ'తో పాటు గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్‌ను తిరిగి ఒక ప్రధాన క్రీడా **మిగతా 2లో**



## హరీశ్ రావు అంత నిష్ణాతుడైతే.. కేసీఆర్ ఎందుకు తీసేశారు?

- సాగునీటి రంగంపై విమర్శలు గుప్పించిన హరీశ్ కు ఉత్తమ్ కౌంటర్
- పెద్ద నిష్ణాతుడైనట్టు హరీశ్ మాట్లాడుతున్నారని ఎద్దేవా
- హరీశ్ విమర్శలకు సరైన సమయంలో సమాధానం చెబుతామని వ్యాఖ్య

తెలంగాణ పత్రిక :సాగునీటి రంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసిన విమర్శలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి **మిగతా 2లో**

## భారత్‌తో వాణిజ్య ఒప్పందం



న్యూజిలాండ్ వ్యాపారాలకు భారీ ఊతం: లక్సన్

తెలంగాణ పత్రిక : భారత్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) న్యూజిలాండ్ వ్యాపారాలకు భారీ అవకాశాలు తీసుకురానుందని ఆ దేశ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ తెలిపారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన తొలి రోజునే న్యూజిలాండ్ ఎగుమతుల్లో 57 శాతం వస్తువులు సుంకం **11లో**

## డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం మీడియా కృషి చేయాలి



తెలంగాణ పత్రిక : డ్రగ్స్ నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చడంలో మీడియా కీలక భాగస్వామిగా ఉండాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించా రు. మత్తు **మిగతా 2లో**

## సింగరేణి బకాయిలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం




2

డిప్యూటీ సీఎం భట్టి విక్రమా ర్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని అన్నారు.



## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్

తెలంగాణ పత్రిక : పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ. లక్ష పూచీకత్తుతో పాటు కోర్టు నిర్దేశించిన షరతుల మేరకు బెయిల్ మంజూరైంది. ఈ కేసు విచారణ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది.

# మూసీ పునరుజ్జీవన పనులకు గ్రీన్ సిగ్నల్..

మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్–1ఏ, జోన్–1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా.. మిగతా రూ.2,845.12 కోట్లు HMDA లేదా TGIIC నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ (EPC) విధానంలో నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(PMC) నియామకానికి సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్ (MRDCL)కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణ నా కల: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించడమే తన వ్యక్తిగత కల అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. క్రీడా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్?లోని గచ్చిబౌలిలో 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ'తో పాటు గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్‌ను తిరిగి ఒక ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రస్థానంలో ఇదొక కీలక ముందడుగు అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 1990 నుంచి 2004 మధ్య కాలంలో హైదరాబాద్ అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదికగా నిలిచిందని, అయితే గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో అటువంటి మెగా ఈవెంట్లు జరగకపోవడంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 'తెలంగాణ వ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో నూతన క్రీడా విధానాన్ని రూపొందించామని తెలిపారు. ఇందులో భాగంగానే వచ్చే నవంబర్‌లో 'ఖేలో ఇండియా' గేమ్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. అపారమైన జనాభా కలిగిన భారతదేశం ఒలింపిక్ పతకాల సాధనలో వెనుకబడి ఉండటంపై రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల విధానపరమైన లోపాలే ఇందుకు ప్రధాన కారణమని ఆయన విమర్శించారు. చిన్న వయసులోనే ప్రతిభావంతులను గుర్తించి, వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు క్రీడలు కూడా ఉపాధికి, ఉజ్వల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తాయని ఆయన వ్యాఖ్యానించారు.

# జూలై 10న చింతకానిలో భారీ రైతు ఆశీర్వాద సభ....

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా పెట్టుబడి సహాయాన్ని అందించిన నేపథ్యంలో జూలై 10న రైతు ఆశీర్వాద సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మంత్రివర్గసభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 3 లక్షల మంది రైతులు ఈ సభకు హాజరవుతారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రైతులే రాష్ట్రానికి వెన్నెముక అని, రైతులకు ప్రతి అడుగులో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం రైతు భరోసా పథకం క్రింద పదేళ్లలో మొత్తం రూ.72 వేల కోట్లు మాత్రమే అందించిందని, తమ ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా క్రింద రూ.35,830 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఒక లక్ష 67 వేల 877 కోట్లను వెచ్చించిందన్నారు. రైతు రుణమాఫీ, ధాన్యానికి బోనస్, పంటల బీమా, పంట నష్టపరిహారం, ఉచిత విద్యుత్, విద్యుత్ సబ్సిడీ, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పలు రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఈ నిధులను వినియోగించినట్లు వివరించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నామని వెల్లడించారు. ఖమ్మం జిల్లా అంటేనే వ్యవసాయానికి ప్రతీక అని, నాగార్జునసాగర్ వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతం వ్యవసాయాభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, భవిష్యత్తులో రైతులకు మరింత మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తామని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయడంలో మీడియా ప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని, కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మీడియా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హరీశ్ రావు అంత నిష్ణాతుడైతే.. కేసీఆర్ ఎందుకు తీసేశారు?

సాగునీటి రంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసిన విమర్శలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇరిగేషన్‌లో హరీశ్ రావు ఏదో పెద్ద నిష్ణాతుడైనట్లు మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. "హరీశ్ రావుకు అంత సత్తా ఉంటే, గత ప్రభుత్వంలో ఆయన మామ కేసీఆర్ ఆయనను ఆ శాఖ నుంచి ఎందుకు తొలగించారు? హరీశ్ రావు పనితీరుపై నమ్మకం లేకనే కేసీఆర్ ఆయనను రాత్రికి రాత్రే నీటి పారుదల శాఖ నుంచి తీసేశారు" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా హరీశ్ రావు ప్రెజెంటేషన్లు ఇస్తున్నారని, ఆయన చూపించిన అబద్ధపు గణాంకాలకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. హరీశ్ రావు చేసిన ప్రతి విమర్శకు సరైన సమయంలో, ఆధారాలతో సహా పూర్తి సమాధానం చెబుతామని మంత్రి స్పష్టం చేశారు.

# చైనాలో ఘోర ప్రమాదం: షూ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం..

చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. జిన్‌జియాంగ్ నగరంలోని ఒక ప్రముఖ షూ తయారీ ఫ్యాక్టరీలో గురువారం భారీగా మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ అధికారిక 'స్టేట్ న్యూస్ ఏజెన్సీ' వెల్లడించింది. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీ లోపల వందలాది మంది కార్మికులు విధులు నిర్వహిస్తుండటంతో తీవ్ర కలకలం రేగుతోంది.

**క్షణాల్లో వ్యాపించిన మంటలు.. వందల మంది నిర్బంధం!**

స్థానిక సమాచారం ప్రకారం.. ఫ్యాక్టరీలో షూ తయారీకి ఉపయోగించే కెమికల్స్, రబ్బర్, గ్లూ వంటి సులభంగా మంటలు అంటుకునే ముడిపదార్థాలు భారీగా ఉండటంతో ప్రమాద తీవ్రత పెరిగింది. ఒక్కసారిగా చెలరేగిన అగ్నికీలలు, దట్టమైన పొగలు ఫ్యాక్టరీ మొత్తాన్ని కమ్మేసాయి. దీంతో ప్రాణాలు రక్షించుకునేందుకు కార్మికులకు దారి దొరకలేదు. ప్రమాదం జరిగిన సమయంలో వందల సంఖ్యలో కార్మికులు లోపలే చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది.

**ప్రాణనష్టం భారీగా ఉండొచ్చు: అధ్యక్షుడు**

**జిన్‌పింగ్ ఆందోళన**

ఈ ఘోర ప్రమాదంపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా మృతుల సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులను రక్షించేందుకు, మంటలను అదుపులోకి తెచ్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వ్యవస్థలను రంగంలోకి దించాలని అధికారులను ఆదేశించారు.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్.. తెలంగాణ ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టులు

నిరుద్యోగ యువతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC)లో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా చేపట్టబోతుండగా... చాలా సంవత్సరాల తర్వాత తెలంగాణలో పర్మినెంట్ (శాశ్వత) ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాలను భర్తీ చేస్తుండటం విశేషం. ఈ నోటిఫికేషన్‌లో అభ్యర్థులకు ఊరటనిచ్చే అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ ఉద్యోగాలకు ఎలాంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించడం లేదు. కేవలం టెన్త్ క్లాస్ లో సాధించిన మార్కుల శాతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన రోస్టర్ విధానం, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌ను సిద్ధం చేసి నేరుగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఎలాంటి పోటీ




పరీక్షలు లేకుండానే ప్రభుత్వ ఉద్యోగం సాధించే సువర్ణావకాశం కావడంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో పర్మినెంట్ బేసిస్‌పై కండక్టర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే మొదటిసారి. గత కొన్నేళ్లుగా చాలా మంది ఉద్యోగులు రిటైర్ కావడంతో ఖాళీలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ లాంటి మహానగరాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇప్పటివరకు తాత్కాలికంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే బస్సులను నడిపించారు. ఇప్పుడు నేరుగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అనుమతి రావడంతో ఆర్టీసీ రూపురేఖలు మారనున్నాయి. అయితే, అఫీషియల్ నోటిఫికేషన్ విడుదలకు ముందు ఒక చిన్న సాంకేతిక సమస్య ఎదురైంది. గతంలో ఎస్ఎస్‌సీ బోర్డు మార్కుల విధానాన్ని అమలు చేయగా.. ఆ తర్వాత కొన్నేళ్ల పాటు జీపీఏ గ్రేడింగ్ విధానాన్ని తెచ్చింది. మళ్లీ ఇటీవల మార్కుల విధానాన్ని కొనసాగిస్తోంది. దీనివల్ల అప్లై చేసుకునే అభ్యర్థుల్లో కొందరికి మార్కులు, మరికొందరికి కేవలం గ్రేడింగ్ మాత్రమే సర్టిఫికేట్లలో ఉన్నాయి. దీంతో జీపీఏ గ్రేడింగ్‌ను మార్కుల శాతంలోకి ఎలా కన్వర్ట్ చేయాలి? ఇరు విధానాల అభ్యర్థులను సమానంగా ఎలా అంచనా వేయాలనే దానిపై స్పష్టత ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు ఎస్ఎస్‌సీ బోర్డుకు లేఖ రాశారు. బోర్డు నుంచి ఈ మార్గదర్శకాలు అందిన వెంటనే కండక్టర్ ఉద్యోగాల అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది.

# బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే... కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. "ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, నేడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని గుర్తుచేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. "కార్మికుల వారసత్వ (డిపెండెంట్) ఉద్యోగాల కోసం నెలలో కనీసం రెండు సార్లు మెడికల్ బోర్డ్ నిర్వహించాలి. ఒకవేళ ప్రభుత్వం, యాజమాన్యం డిపెండెంట్ ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వకపోతే.. ఈనెల 20 నుంచి రామగుండం వేదికగా నిరవధిక దీక్ష చేపడతాం" అని స్పష్టం చేశారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం మీడియా కృషి చేయాలి

డ్రగ్స్ నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చడంలో మీడియా కీలక భాగస్వామిగా ఉండాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరంతర అవగాహన కల్పించడంలో మీడియా ముందుండాలని పేర్కొన్నారు. ప్రతి ఇంటిని, ప్రతి గ్రామాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పుకొచ్చారు. గురువారం హనుమకొండలో గవర్నర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మీడియాతో మాట్లాడారు.

**మీడియా నిర్మాణాత్మక పాత్ర పోషించాలి..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చివరి లబ్ధిదారుని వరకు చేరేలా మీడియా నిర్మాణాత్మక పాత్ర పోషించాలని గవర్నర్ సూచించారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా చైతన్యానికి సంబంధించిన సానుకూల అంశాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా బాధ్యత ఎంతో కీలకమని చెప్పుకొచ్చారు. ప్రజల్లో బాధ్యత, సామాజిక చైతన్యం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంచేందుకు మీడియా నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. మత్తు రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మీడియా సంపూర్ణ సహకారం అందించాలని గవర్నర్ కోరారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో మీడియా ఒక శక్తివంతమైన వేదికగా నిలవాలని సూచించారు. ప్రభుత్వం, ప్రజలు, మీడియా సమష్టిగా కృషి చేసినప్పుడే డ్రగ్స్ రహిత భారత్ -- డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం సాకారమవుతుందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు.

# సింగరేణి బకాయిలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం

సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

# 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

2034 నాటికి 1 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశ జీడీపీలో 10శాతం వాటా తెలంగాణ నుంచే ఉండాలన్నారు. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# శివాలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల ముక్తేశ్వరరావుకు డాక్టరేట్

**-40 ఏళ్ల ఆధ్యాత్మిక సేవకు గుర్తింపు**
**-సంగీత రంగంలో విశిష్ట సేవలకు అరుదైన గౌరవం**

**కొత్తగూడెం, జూలై 9 (తెలంగాణ పత్రిక):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ప్రగతి నగర్ శివాలయం ప్రధాన అర్చకులు, ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు మద్దిరాల ముక్తేశ్వరరావుకు అమెరికన్ యునైటెడ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పుదుచ్చేరిలోని కంభన్ కలైరంగం ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ కె. వెంకటేశం చేతుల మీదుగా ముక్తేశ్వరరావు డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా ఆధ్యాత్మిక సేవతో పాటు శాస్త్రీయ సంగీతానికి విశేష కృషి చేస్తున్న ముక్తేశ్వరరావు రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక భజన బృందాలను తీర్చిదిద్దారని, యువతలో భక్తి భావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సంగీత రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 48 గంటల పాటు నిర్విరామంగా హార్మోనియం వాయించి ప్రత్యేక ప్రతిభ చాటినందుకు "హార్మోనియం





విధ్వంసమణి" బిరుదుతో సత్కరించారు. అలాగే కాకినాడలో నిర్వహించిన భజన పోటీలలో ప్రతిభావంతమైన న్యాయ నిర్ణేతగా సేవలందించినందుకు నిర్వాహకులు "స్వర్ణ సింహ కంకణం" అందజేసి "సువర్ణ సింహ తలాట సన్మాన" పురస్కారంతో గౌరవించారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ముక్తేశ్వరరావు అమెరికన్ యునైటెడ్ యూనివర్సిటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ప్రాంత అర్చకులు, ప్రముఖులు, శివభక్తులు ఆయనను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్టీసీ విలీనంలో జాప్యానికి యూనియన్ నాయకుల ద్వంద్వ వైఖరే కారణం

**-హనుమంతు ముదిరాజ్**

**కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**
టీఎస్ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ 90 శాతం పూర్తయిందని, కేవలం గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉందని టీజేఎంయు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలీన ప్రక్రియ తుది దశలో ఉన్న తరుణంలో, కొంతమంది యూనియన్ నాయకులు ఎన్నికలు నిర్వహించిన తర్వాతే గెజిట్ ప్రకటించాలని ద్వంద్వ వైఖరి అవలంబించడం వల్లే ప్రస్తుత జాప్యం



చోటుచేసుకుందని ఆయన విమర్శించారు. కార్మికుల ప్రయోజనాల కంటే స్వార్థ రాజకీయాల కోసం ఎన్నికల వైపు మళ్లిన నాయకులకు కార్మికులు తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. తొలుత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని పోరాటం మొదలుపెట్టింది తామేనని గుర్తు చేస్తూ, ఎప్పుడూ ఎన్నికలను కోరుకోలేదని ముదిరాజ్ స్పష్టం చేశారు. అయితే, ఇప్పుడు అనివార్యంగా జరుగుతున్న ఎన్నికల్లో టీజేఎంయు పోటీ చేస్తుందని, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న తమను భారీ మెజారిటీతో గెలిపించి, గుర్తింపు సంఘంగా నిలబెట్టాలని కోరారు. ఈ సమావేశంలో టీజేఎంయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డేమాన్ సాములయ్య, కోశాధికారి పి.ఎస్.ఎస్. రాజు రావు, నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మెంబర్ సాయిలు, కామారెడ్డి డిపో కార్యదర్శి అలీ, నాయకులు సయ్యద్ ఇసాక్, బాబుషా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి చట్టాలు అమలవుతున్నాయా? ఉల్లంఘనలకు బాధ్యులు ఎవరు?

**-పుస్తకాలకే పరిమితమైన 1/70, ఫ్రా, పేసా చట్టాలు: కోరం వెంకటేశ్వర్లు ఆందోళన**

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 9 (తెలంగాణ పత్రిక):**
ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం రూపొందించిన రాజ్యాంగ, చట్టపరమైన నిబంధనలు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదని ఆదివాసి నాయకుడు కోరం వెంకటేశ్వర్లు (గణేష్ అన్న) ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో, ఈ పరిస్థితికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఆదివాసులు ఎన్నో త్యాగాలు, ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న 1/70 భూమి బదలాయింపు నియంత్రణ చట్టం, అటవీ హక్కుల చట్టం (ఫ్రా), పేసా చట్టం వంటివి కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఈ చట్టాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు కావాలని డిమాండ్ చేశారు.

**షెడ్యూల్డ్ ప్రాంతాల్లో సమస్యలు:**
ఆదివాసులు నివసించే షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూముల పరిరక్షణ, అటవీ హక్కులు, జీవనోపాధి, ఉపాధి అవకాశాల విషయంలో అనేక సమస్యలు



కొనసాగుతున్నాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో భూముల బదలాయింపులు, గనుల తవ్వకాలు, ఇసుక ర్యాంపుల అనుమతులు, పరిశ్రమల విస్తరణ వంటి అంశాలపై స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని అన్నారు.

**చట్ట ఉల్లంఘనలపై విచారణ కోరిన గణేష్ అన్న**
షెడ్యూల్డ్ ప్రాంతాల్లో చట్టాలను ఉల్లంఘించే చర్యలపై సంబంధిత అధికారులు చట్టప్రకారం విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూములపై తలెత్తుతున్న వివాదాలు, హక్కుల అంశాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. అదేవిధంగా ఆదివాసి ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకల వల్ల ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు, అత్యవసర సేవలకు అంతరాయం కలుగుతున్నాయని పేర్కొంటూ, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**5వ షెడ్యూల్ అమలుకు పిలుపు**
భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం ఆదివాసుల హక్కులు, భూములు, సహజ వనరుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, గవర్నర్ కార్యాలయం, సంబంధిత శాఖలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. ఆదివాసుల సంక్షేమం కోసం అమల్లో ఉన్న చట్టాలు పూర్తిస్థాయిలో అమలైతేనే వారి జీవన హక్కులు, భూమి హక్కులు, అస్తిత్వం సురక్షితంగా ఉంటాయని, ప్రజల అభ్యర్థనలు, సమస్యలను చట్టబద్ధంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరం వెంకటేశ్వర్లు (గణేష్ అన్న) ప్రభుత్వాలను డిమాండ్ చేశారు

# ప్రజల పాలిట శాపంగా మారిన బిబిపేటయూనియన్ బ్యాంక్

**-రెండు రోజులుగా తిరిగినా కాని పనులు!**

**కామారెడ్డి ,జులై 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**
బ్యాంకు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ, కామారెడ్డి జిల్లా బిబిపేట మండల కేంద్రంలోని ఎస్బిఐ యూని యన్ బ్యాంకు అధికారుల తీరుపై ప్రజలు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజు లుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా కనీస పను లు కాకపోవడంతో వినియోగదారుల సహనం నశించింది. ఈరోజు యూనియన్ బ్యాంక్ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

**రైతన్నల గోస.. వడ్ల పైసలు రావు, రుణ మాఫీలు కావు!**
ప్రస్తుతం రైతాంగానికి అత్యంత కీలకమైన సమయం.ఒకపక్క ప్రభుత్వం వేస్తున్న వడ్ల పైసలు (ధాన్యం డబ్బులు) ఖాతాల్లో జమ అయినా తీసుకోలేని పరిస్థితి, మరోపక్క రైతు రుణాలు,క్రాప్ లో న్లు (పంట రుణాలు) సకాలంలో అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.యూనియన్ బ్యాంకు నమ్ముకుంటే మాకు అడుగడుగునా కష్టా లే మిగులుతున్నాయి. గంటల తరబడి లైన్లలో



నిలబడినా సర్వర్ లేదు.లింక్ లేదు అంటూ సాకు లు చెబుతున్నారు. మాకు ఈ బ్యాంకు వద్దుమా ఊరికి వెంటనే మరో బ్యాంకు కావాలిఅంటూ ఆవేదనతో రైతులు నినదించారు.రంగంలోకి మాజీ ఎంపీటీసీ నీరజ భర్త అధికారులతో ఫోన్లో రాయ బారం బ్యాంక్ వద్ద ఉద్రిక్తత నెలకొందన్న సమా చారం అందుకున్న వెంటనే స్థానిక మాజీ ఎంపీటీసీ నీరజ భర్త సంఘటనా స్థలానికి చేరుకున్నా రు. ఆందోళన చెందుతున్న ప్రజలు, రైతులతో మా ట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూనియన్ బ్యాంకు అధికారుల తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రజల ఇబ్బందుల ను కళ్లారా చూసిన ఆయనవెంటనే స్పందించి ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఇక్కడి ప్రజల అవస్థలను, రైతుల ఇబ్బందులను అధికా రుల దృష్టికి తీసుకెళ్లారు. కేవలం ఒకే బ్యాంకు ఉండటం వల్ల పని భారం పెరిగి ప్రజలకు సేవలు అందడం లేదని, కాబట్టి వెంటనే ఇక్కడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను ఏర్పాటు చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. అధికారులారా స్పందించండి ఎస్ బి ఐబ్రాంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి! ఈ ప్రాంతంలో జనాభా పెరిగింది, దానికి తోడు రైతులకు సంబంధించిన లావాదేవీలు కోట్లలో జరుగుతు న్నాయి. ఇలాంటి తరుణంలో ఒకే ఒక్క బ్యాంకుపై వేలాది మంది ఆధారపడటం వల్ల ప్రతిరోజూ నర కం చూస్తున్నారు.ప్రజల, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఉన్నతాధికారులు జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతి పదికన స్పందించాలి.బీబీపేట్ మండల కేంద్రంలో ఎస్‌బీఐ నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేసేం దుకు తక్షణమే సర్వే నిర్వహించి, అనుమతులు మంజూరు చేయాలి.ఒకవేళ అధికారులు ఇప్పటి కైనా స్పందించి కొత్త బ్యాంకును ఏర్పాటు చేయక పోతేరాబోయే రోజుల్లో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళనలు తీవ్రతరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా పాల కులు, ఉన్నతాధికారులు కళ్లు తెరిచి ఎస్‌బీఐ బ్యాంకు ఏర్పాటు దిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు.

## రామారెడ్డి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన టి మురళిని మర్యాదపూర్వకంగా కలిసిన జర్నలిస్ట్ గైని శ్రీకాంత్



**కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**
కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై టీ మురళిని మర్యాదపూర్వకంగా కలిసిన జర్నలిస్ట్ గైని శ్రీకాంత్. తాడ్వాయి. దోమకొండ కామారెడ్డి పోలీస్ స్టేషన్ లో ఉత్తమ సేవలందించి ప్రజల వందనాలు పొంది బదిలీపై రామారెడ్డి పోలీస్ స్టేషన్ కు వచ్చిన టి మురళిని మర్యాదపూర్వకంగా కలిసిన జర్నలిస్ట్ గైని శ్రీకాంత్ ఈ సందర్భంగా ఎస్సై టి మురళి మాట్లాడుతూ రామారెడ్డి మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని రాజీమార్గం రాజా మార్గమని ఆయన మండల ప్రజలకు సూచించారు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు.

## సిద్ధంశెట్టి దత్తును పరామర్శించిన కంఠారెడ్డి తిరుపతి రెడ్డి



**మెదక్,జూలై 09:(తెలంగాణ పత్రిక):**
మెదక్ జిల్లా,పాపన్నపేట మండల పరిధిలోని పాత లింగాయిపల్లి గ్రామానికి చెందిన చీకోడ్ పీఏసీఎస్ చైర్మన్,బీఆర్ఎస్ నాయకులు సిద్ధంశెట్టి దత్తు తండ్రి సిద్ధంశెట్టి సంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి గురువారం పాత లింగాయిపల్లి గ్రామానికి వెళ్లి దత్తుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా సంగయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని తెలిపారు.సంగయ్య మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీష్,పాపన్నపేట మండల యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చంద్రమోహన్ గౌడ్, కల్వకుంట సర్పంచ్ అందే కొండల్ రెడ్డి,గ్రామ అధ్యక్షుడు కృష్ణ గౌడ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యార్థి దినోత్సవ శుభాకాంక్షలు


**-ఎబివిపి 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.**



**ఇల్లంతకుంట, జూలై 9, తెలంగాణ పత్రిక**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇల్లంతకుంట మండల కేంద్రంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద వంశీకృష్ణ ఆధ్వర్యంలో గురువారం రోజున మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద వంశీకృష్ణ మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని '1949'లో నలుగురు విద్యార్థులతో ప్రయాణమైన ఎబివిపి ఇరోజు అన్ని యూనివర్సిటీలలో, కళాశాలలో అధ్యధికంగా సభ్యత్వం ఉన్నటువంటి ఏకైక విద్యార్తి సంఘం ఎబివిపి అని దేశం, ధర్మం, సంస్కృతి కోసం పనిచేసే విద్యారి సంఘం జాతీయ భావాలు కలిగినటువంటి విద్యారి సంఘం ఎబివిపి అని పేర్కొన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అన్ని విద్యారంగా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తూ సమాజ హితం కోసం నాటి నుంచి నేటి వరకు అలుపెరుగని పోరాటం చేస్తున్న ఏకైక సంస్థ ఎబివిపి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విష్ణు, హరీష్, శివమణి, అరుణ్, ఫయాజ్, అంకిత్, చందూ, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద లింగాపూర్ కు లైన్ మెన్ ను నియమించాలి

**-సర్పంచ్ గన్నేరం వసంత విద్యుత్ అధికారులకు వినతి**



**ఇల్లంతకుంట, జూలై 9, తెలంగాణ పత్రిక**

ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామానికి వెంటనే లైన్ మెన్ ను నియమించి, గ్రామంలో పేరుకుపోయిన విద్యుత్ పనులను పూర్తి చేయాలని ఆ గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత విద్యుత్ అధికారులను కోరారు.గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో సర్పంచ్ గన్నేరం వసంత అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా తమ గ్రామానికి లైన్ మెన్ లేరని తెలిపారు. గతంలో ఉన్న లైన్ మెన్ పదవీ విరమణ చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కొత్తగా ఎవరినీ కేటాయించలేదని అన్నారు. ఇంత పెద్ద గ్రామపంచాయతీకి సుమారు 72 ట్రాన్స్ఫార్మర్లు ఉన్నాయని, నిరంతరం ఏదో ఒక సమస్య వస్తుందని, అప్పుడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సమస్యకు సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్, లైన్ ఇన్స్పెక్టర్ ను సంప్రదించవలసి వస్తుందని, ప్రతిరోజు సమస్యలు వస్తున్నప్పుడు ఇతర గ్రామానికి చెందిన లైన్ మెన్ ను పంపించడం వల్ల జాప్యం జరుగుతుందని చెప్పారు. అలాగే గ్రామంలో గత మూడు నెలల క్రితం కొన్ని విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని, వాటికి నేటివరకు కనెక్షన్ ఇవ్వలేదని అన్నారు.కాబట్టి అధికారులు వెంటనే స్పందించి పేరుకుపోయిన పెండింగ్ పనులు పూర్తి చేసి, తమ గ్రామానికి పూర్తిస్థాయి లైన్ మెన్ ను కేటాయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన



**ముధోల్:09జూలై(తెలంగాణ పత్రిక)**


ప్రకృతి వైపరీత్యాలపై మండలంలోని అష్ట గ్రామంలో ఎన్డిఆర్ఎఫ్ (జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం) అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ రావుల లావణ్య- శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు ప్రకృతి విపత్తుల వల్ల వరదలు, భూకంపాలు, తుపాన్ ల ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాల్సిన దానిపై తెలియజేశారు. జరగబోయే ప్రమాదం విపత్తు నుండి ఎలా రక్షించుకోవాలో ఎన్డీఆర్ ఎఫ్ టీం కమాండర్ ముఖేష్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ లో నవీన్, సురేష్, రమేష్ లు వరదలు , అగ్ని ప్రమాదాలు, మానవ ప్రేరేపిత విపత్తులపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. అదేవిధంగా సిపిఆర్ పై ప్రదర్శన రూపంలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవ కుమార్, మండల విద్యాధికారి రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సాయి రెడ్డి, ఉప సర్పంచ్ సావిత్ర కోటయ్య,పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, రాజేశ్వర్, పోలీసు సిబ్బంది భీమయ్య శ్రీనివాస్ మురళి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## టవర్లు ఉన్నాయి... సిగ్నల్ లేదు..!

**-ఆళ్లపల్లిలో నెట్వర్క్ సంక్షోభం... రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో..!**

**-రీఛార్జిల్ ఫుల్... నెట్వర్క్ సేవలు నిల్ ఆళ్లపల్లిలో టెలికం వైఫల్యం**

**ఆళ్లపల్లి // తెలంగాణ పత్రిక ప్రతినిధి //జూలై 9**



ఆళ్లపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఎయిర్టెల్, జియో నెట్వర్క్ సేవలు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మొబైల్ టవర్లు కళ్లముందే కనిపిస్తున్నా, వినియోగదారులకు కనీస సిగ్నల్ కూడా అందకపోవడం తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. ఫోన్ కాల్స్, ఇంటర్నెట్ సేవలు సరిగా అందక ప్రజలు సిగ్నల్ కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ సేవలు, బ్యాంకింగ్ లావాదేవీలు, ఆన్లైన్ దరఖాస్తులు, విద్యార్థుల విద్యా సంబంధిత పనులు నెట్వర్క్ లేక నిలిచిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు యూరియా ఎరువుల బుకింగ్లు, ఇతర వ్యవసాయ సంబంధిత ఆన్లైన్ నమోదులు పూర్తి చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయానికి బుకింగ్లు చేయలేక పంటల సాగుపై ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల నుంచి వరుసగా ఫిర్యాదులు వెళ్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి సంబంధిత టెలికాం సంస్థలు తక్షణ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి నెలా రీచార్జీలు, బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ కనీస స్థాయి నెట్వర్క్ సేవలు కూడా అందకపోవడంపై వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# బండి సంజయ్ ఆయురారోగ్యాల కోసం అర్చన

**-జన్మదిన వేడుకల్లో భాగంగా ముందస్తు పూజలు**

**ఇల్లంతకుంట, జూలై 9, గురువారం తెలంగాణ పత్రిక**



కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ జూలై 11 జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం ఇల్లంతకుంట మండలం రామోజీపేట గ్రామంలోని శ్రీ సీతారాముల దేవస్థానంలో ముందస్తు అర్చన కార్యక్రమం నిర్వహించారు.భారతీయ జనతా పార్టీ ఇల్లంతకుంట మండల ప్రధాన కార్యదర్శి కరికె నవీన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బండి సంజయ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని దేవుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా కరికె నవీన్ కుమార్ మాట్లాడుతూ కర సేవకుడు, హిందుత్వ యోధుడు అయిన బండి సంజయ్ అన్న దేశ సేవలో ఇలాగే ముందుకు సాగాలని అన్నారు. జూలై 11న ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని, ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కార్యవర్గ సభ్యులు పయ్యావుల బాలయ్య, పలుమారి రవి సీనియర్ మండల నాయకులు దండవెని రజనీకాంత్, బూత్ అధ్యక్షులు అరుణ్, శ్రీశైలం, సేరు శ్రీనివాస్, చెప్పరి వంశీ, కరికె బాబు, రేగుల ప్రశాంత్ ఎగుర్ల శ్రీనివాస్, చిక్కుడు శ్రీనివాస్, మహిళా నాయకురాలు బెజ్జంకి అశ్రుత, బర్ల శ్రీనివాస్, కంకటి శ్రీకాంత్, చింతమడక ఈశ్వర్, మరుపక దీక్షిత్, పలుమారి సాయి దుర్గ తో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ పోటీలో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ







**-సృజనాత్మక ఆలోచనతో పాఠశాలకు కీర్తి తెచ్చిన విద్యార్థులు**

**-ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య**

**వెల్దుర్తిమండల ప్రతినిధి,జులై 09 (తెలంగాణ పత్రిక):**

వికసిత్ భారత్ ఇన్నోవేషన్ పోటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ వినూత్న ఆలోచనతో ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన మహమ్మద్ నసీర్ మహమ్మద్, లిఖితతో కూడిన బృందం రూపొందించిన ప్రాజెక్టు రెండు దశల్లో ఎంపికై ప్రత్యేక గుర్తింపు పొందిందని ఎంపిక కాబడిన ఒక్కొక్క గ్రూప్ కు పదివేల రూపాయలు ఇవ్వడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. వాహనాలు రోడ్లపై ప్రయాణించే సమయంలో ఏర్పడే ఒత్తిడిని ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేసే పిజో ఎలక్ట్రానిక్ ప్లేట్లు అనే వినూత్న సాంకేతికత ఆధారంగా విద్యార్థులు తమ ప్రాజెక్టును రూపొందించారు. ఈ విధానం ద్వారా శిలాజ ఇంధనాలపై ఆధారపడకుండా హరిత శక్తి ఉత్పత్తికి అవకాశం ఉంటుందని వారు వివరించారు. విద్యార్థుల సృజనాత్మక ఆలోచన, శాస్త్రీయ దృక్పథం న్యాయనిర్ణేతలను ఆకట్టుకోగా, ఈ ప్రాజెక్టు పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చిందని ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. విద్యార్థులను సిద్ధం చేసిన ఉపాధ్యాయులను, విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

# భక్తజన సందోహంతో కళకళలాడిన హనుమాన్ ఆలయ ప్రాంగణం







**-అన్నదానంతో అలరించిన హనుమాన్ దేవాలయ వార్షికోత్సవ వేడుకలు**

**వెల్దుర్తిమండల ప్రతినిధి,జులై 09 (తెలంగాణ పత్రిక):**

వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ దేవాలయం ఐదవ వార్షికోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు, మాజీ జెడ్పీటీసీ ఆముదాల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఉదయం నుంచే ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవాచనం, హోమం, అంజనేయ స్వామికి విశేష అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దైవ దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో నిర్వహించిన మహా అన్నదానంలో వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రాంగణం అంతా "జై శ్రీరామ్", "జై హనుమాన్" నామస్మరణలతో మార్మోగింది. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు, వార్షికోత్సవ వేడుకలు కొనసాగనున్నట్లు ఆలయ నిర్వాహకుడు ఆముదాల ఆంజనేయులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ వార్షికోత్సవాన్ని భక్తి భావంతో విజయవంతం చేశారు.

# భద్రాచలం రామాలయంలో ఘనంగా 'లెనిన్' సినిమా పోస్టర్ ఆవిష్కరణ




**-శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా ఆవిష్కరణ**

**-'నాగ అఖిల్' నామకరణం గర్వకారణమని మల్లెల నరసింహారావు వ్యాఖ్య**

**భద్రాచలం, జూలై 9 (తెలంగాణ పత్రిక):**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం 'లెనిన్' సినిమా విడుదల సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై, మల్లెల నరసింహారావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మల్లెల నరసింహారావు మాట్లాడుతూ, ఇటీవల తిరుపతిలో నిర్వహించిన 'లెనిన్' సినిమా ఈవెంట్ సందర్భంగా జరిగిన ఓ విశేషాన్ని గుర్తు చేశారు. తమ తాతయ్య వారసులు మొదటి నుంచి అక్కినేని కుటుంబానికి అభిమానులని పేర్కొన్నారు. అక్కినేని నాగేశ్వరరావు, అక్కినేని నాగార్జున, అక్కినేని నాగచైతన్య పేర్లలో "నాగ" అనే పదం ఉండగా, అఖిల్ పేరులో మాత్రం అది లేకపోవడం తమకు కొంత బాధ కలిగించిందన్నారు. ఆ లోటును పూరించాలనే ఉద్దేశంతో అఖిల్‌కు "నాగ అఖిల్" అని నామకరణం చేయడం జరిగిందని, వేలాది మంది అభిమానులు, ప్రజల సమక్షంలో తిరుపతిలో ఆ నామకరణ కార్యక్రమం నిర్వహించడం ఎంతో గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ నిర్ణయం అక్కినేని అభిమానుల్లో విశేష ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెల నరసింహారావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సినీ అభిమానులు, ప్రజాప్రతినిధులు, ఆలయానికి వచ్చిన భక్తులు పాల్గొని చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం చిత్ర విజయాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



# కళాశాల సమయాలకు అనుగుణంగా బస్సులు నడపాలి

**-అవసరమైతే అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి: ఎస్ఎఫ్ఐ నాయకులు**

మేడ్చల్, జూలై 9 తెలంగాణ పత్రిక



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ సంబంధిత ఆర్టీసీ డిపో మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేసింది. కళాశాలల సమయాలకు అనుగుణంగా బస్సులు నడపడంతో పాటు అవసరమైతే అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ, కళాశాలలు సాయంత్రం 4:30 గంటలకు ముగుస్తుండగా సంబంధిత గ్రామాలకు వెళ్లే బస్సు 4:10 గంటలకే బయలు దేరుతుండటంతో విద్యార్థులు దానిని అందుకోలేకపోతున్నారని తెలిపారు. అనంతరం వచ్చే బస్సు 5:30 గంటలకు మాత్రమే ఉండటంతో గంటకుపైగా బస్‌స్టాండ్‌లో వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ఆ బస్సు కూడా ఆలస్యంగా ప్రధాన బస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడి నుంచి మరో బస్సు లేదా ఇతర వాహనాల్లో గ్రామాలకు వెళ్లాల్సి రావడం వల్ల విద్యార్థులు రాత్రి వేళల్లోనే ఇళ్లకు చేరుకుంటున్నారని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థినులు చీకటి పడిన తర్వాత దూర గ్రామాలకు వెళ్లాల్సి రావడం భద్రతాపరంగా ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఆలస్యంగా ఇంటికి చేరుకోవడం వల్ల తల్లిదండ్రులు ఆందోళన చెందడంతో పాటు విద్యార్థుల చదువుకు కేటాయించాల్సిన సమయం ప్రయాణంలోనే వృథా అవుతోందన్నారు. కనుకుంట, వీరారెడ్డిపల్లి, మైసిరెడ్డిపల్లి, కొనాయిపల్లి, డబిల్‌పూర్, నూతన్‌కల్, కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి తదితర గ్రామాల విద్యార్థులు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల నుంచి బస్‌పాస్‌ల రూపంలో ఆర్టీసీ భారీ మొత్తంలో రుసుములు వసూలు చేస్తున్నప్పటికీ, వారి అవసరాలకు అనుగుణంగా బస్సులు నడపడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు విమర్శించారు. కళాశాలలు ముగిసే సమయానికి అనుగుణంగా సాయంత్రం 4:45 లేదా 5:00 గంటలకు బస్సులను నడపాలని, అవసరమైతే ప్రత్యేక అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి ఆర్టీసీ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వినయ్, సాయి, రాజాతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు కోసం జన జాగరణ యాత్రకు శ్రీకారం

**-జూలై 11న భద్రాచలం నుంచి రాష్ట్రవ్యాప్త యాత్ర ప్రారంభం**
**-పోస్టర్ ఆవిష్కరించిన న్యాయశాఖ ఉద్యోగులు**

కొత్తగూడెం లీగల్, జూలై 9:




తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న జన జాగరణ యాత్ర పోస్టర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఎస్ టీం సభ్యుడు, జ్యుడీషియల్ ప్రతినిధి ఎస్.కే. మజహర్ అహ్మద్ మాట్లాడుతూ, జూలై 11న భద్రాచలం నుంచి ప్రారంభమయ్యే జన జాగరణ యాత్ర రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కొనసాగి, ఆగస్టు 23న హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభతో ముగుస్తుందని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ తరఫున అప్పటి ముఖ్య మంత్రి అభ్యర్థి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకొని వెంటనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇందుకు అవసరమైన కార్యాచరణను ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగులు మీనా కుమారి, ప్రమీల, యదా రమణ, తాజుద్దీన్ బాబా, రామ తులసి, విజయలక్ష్మి, కవిత, కరుణాకర్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. జూలై 11న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించనున్న జన జాగరణ యాత్రలో న్యాయశాఖ ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ డిమాండ్‌ను బలంగా వినిపించనున్నట్లు తెలిపారు.

## విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం.. 55 మందికి పరీక్షలు

తెలంగాణ పత్రిక దమ్మపేట జూలై 9




విశ్రాంతి ఉద్యోగుల సంఘం దమ్మపేట మండల శాఖ ఆధ్వర్యంలో, శరత్ మ్యాక్సీ విజన్ ఖమ్మం బ్రాంచ్ సహకారంతో స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మ్యాక్సీ విజన్‌కు చెందిన విక్రమ్ సింగ్ నేతృత్వంలోని వైద్య బృందం మొత్తం 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించింది. పరీక్షల అనంతరం కంటి ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కంటి సమస్యలను నివారించే మార్గాలపై వైద్య బృందం అవగాహన కల్పిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు అందించింది. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్. అజయ్ కుమార్, ఎస్. సాంబయ్య, మోషే, ఎన్. అంజయ్యతో పాటు పలువురు విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే మ్యాక్సీ విజన్ సిబ్బంది విక్రమ్ సింగ్, లెనిన్, అనిల్ శిబిరం నిర్వహణలో పాల్గొని సేవలు అందించారు. వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన మ్యాక్సీ విజన్ వైద్య బృందానికి విశ్రాంతి ఉద్యోగుల సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# దసరాలోపు పీఆర్సీ ప్రకటించకుంటే ఉద్యమమే.!







**-ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వానికి పీఆర్టీయూ హెచ్చరిక**
**-సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి**

సిద్ధిపేట జిల్లా ప్రతినిధి, జూలై 9 (తెలంగాణ పత్రిక):

ఉపాధ్యాయూ, ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న వేతన సవరణ కమిషన్ ను దసరాలోపు ప్రకటించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి డిమాండ్ చేశారు. దసరా లోపు పీఆర్సీ ప్రకటించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుడుతామని స్పష్టం చేశారు. పీఆర్టీయూ సిద్దిపేట రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఇర్కోడు, తోర్నాల, రావురూకుల, రాఘవాపూర్ పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. సిద్ధిపేట రూరల్ మండల శాఖ అధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కంతుల శ్రీశైలం ఆధ్వర్యంలో సభ్యత్వ కార్డులను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఆరోగ్య కార్డుల మార్గదర్శకాలను విడుదల చేసి ప్రతి ఉపాధ్యాయుడికి నగదు రహిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ కింద వేతనాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ లను మంజూరు చేయాలని కోరారు. సీపీఎస్ ఉపాధ్యాయులకు డీఏ బకాయలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీలు తక్షణమే నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. గురుకుల పాఠశాలల్లో సమయాలను సవరించి ఉపాధ్యాయులపై అధిక పనిభారం తగ్గించాలని చెప్పారు. కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు. పాఠశాలల విలీనాలు, వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి గ్రామీణ పాఠశాలలు మూత పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కావెంజర్ల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీసు నిబంధనలను అమలు చేసి ఉపాధ్యాయులకు ఎంఈఓ, జే ఎల్ పదోన్నతులు కల్పించాలని కోరారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభు త్వం అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

## రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు

**-తహసీల్దార్ కార్యాలయంలో ఘోర నిర్లక్ష్యం..! వందల సర్టిఫికెట్లు పెండింగ్‌లో.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం.**
**-పెండింగ్ సర్టిఫికెట్లపై వెంటనే చర్యలు తీసుకోండి..! ప్రభుత్వాన్ని వేడుకుంటున్న విద్యార్థులు"**




ఆళ్లపల్లి //తెలంగాణ పత్రిక ప్రతినిధి//జూలై 9

ఆళ్లపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వందలాది కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు పేరుకుపోయి ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించి, అవసరమైన పత్రాలను కార్యాలయంలో అందజేసినప్పటికీ సర్టిఫికెట్లు జారీ కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "రోజూ వస్తున్నాం... గంటల తరబడి ఎదురుచూస్తున్నాం... అయినా మా సమస్య వినేవారు లేరు. ఇంకా ఎన్ని రోజులు కార్యాలయం చుట్టూ తిరగాలి?" అంటూ విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కాలేజీ అడ్మిషన్ల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో సర్టిఫికెట్లు అందక తమ చదువుకు ఆటంకం ఏర్పడుతోందని విద్యార్థులు వాపోయారు. ఉదయం ఆలస్యంగా కార్యాలయానికి రావడం, అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, ఖాళీ కుర్చీలు కనిపించడం వంటి పరిస్థితులపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లను అత్యవసరంగా జారీ చేయాలని, నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గంభీరావుపేటలో ఘనంగా ఏబివిపి ఆవిర్భావ వేడుకలు

గంభీరావుపేట తెలంగాణ పత్రిక జులై 9






78వ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దినోత్సవం పురస్కరించుకొని గురువారం రోజున మండల అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ శాఖ తరపున జెండా ఆవిష్కరించి మొక్కలు నాటారు అనంతరం వారు మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విద్యార్థుల అభివృద్ధి కొరకై విద్యార్థుల హక్కులకై ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు 1949లో నలుగురి విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ నేడు అన్ని యూనివర్సిటీలు కళాశాలలో అత్యధిక సభ్యత్వం ఉన్న ఏకైక విద్యార్థి సంఘం గా ఎదిగిందని అన్నారు దేశం ధర్మం సంస్కృతి కోసం పనిచేసే విద్యార్థి సంఘం ఏబీవీపీ అని జాతీయ భావాలు కలిగిన సంస్థ అని కొనియాడారు విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తూ సమాజ హితం కోసం నాటి నుంచి నేటి వరకు అలుపెరుగని పోరాటం చేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ బండ మహేందర్ ప్రధాన కార్యదర్శి బీర రాకేష్ కార్యకర్తలు చేకూటి సతీష్ జింక సిద్దు సిహెచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి

**-రూ.5 వేల ఆర్థిక సాయం.**

పాపన్నపేట, జూలై 09:(తెలంగాణ పత్రిక)



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుర్తివాడ గ్రామానికి చెందిన సంజులు భార్య జయమ్మ కుటుంబ సభ్యులను గురువారం కంఠరెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా జయమ్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఆయన, రోడ్డు ప్రమాదంలో జయమ్మ మృతి చెందడం ఎంతో బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలగౌడ్, మాజీ గ్రామ అధ్యక్షుడు సిద్ధిరామిరెడ్డి, మాజీ ఏడుపాయల దేవస్థానం డైరెక్టర్ మోహన్‌రావు,బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీష్, కల్వకుంట సర్పంచ్ అందె కొండల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, విల్సన్, చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీట్ ఆఫీసర్ భర్త దౌర్జన్యం

-రాత్రి వదిలేసి తెల్లారి స్వాధీనం
-పట్టుకొన్న కలపను వదిలేసిన ఫారెస్ట్ ఆఫీసర్స్
-3 ట్రాక్టర్ ల కలపలో రెండు ట్రాక్టర్ ల కలపమాయం నేడు ఒక్క ట్రాక్టర్ కలప స్వాధీనం



కొత్తగూడ మండల ప్రతినిధి:- జూలై 09.(తెలంగాణ పత్రిక):-

మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండల కేంద్రం పరిధిలోని ముస్మిలో నిన్న అటవీ శాఖ అధికారుల అత్యుత్సాహం. అదుపులోకి తీసుకొన్న కలపను వదిలేసి స్మగ్లర్లకు కొమ్ము కాసిన ఘటన వెలుగులోనికి వచ్చింది. గూడూరు ఎఫ్ డి వో కు విశ్వసనీయా సమాచారం మేరకు, అయన నిన్న సాయంత్రం మూడు ట్రాక్టర్ల కలపను అదుపులోకి తీసుకొని, కలపను వదిలేసి వచ్చారు. ఈ విషయంలో ఓ బీట్ ఆఫీసర్ భర్త దౌర్జన్యం చేసి సిబ్బందిని తిప్పి పంపినట్లు సమాచారం. విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో, రేంజ్ సిబ్బందిని గురువారం పంపి సదరు కలపను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో సిబ్బంది వెళ్లి ఒక్క ట్రాక్టర్ కర్రను మాత్రేమే రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు సమాచారం. మరో రెండు ట్రాక్టర్ల కలప ఎటు వెళ్లినట్లు? అనేది ఫారెస్ట్ ఉన్నతాధికారులు పూర్తి సమాచారం ఇవ్వాల్సి ఉంది.

## వృద్ధాశ్రమంలో బంగ్లా అన్వేష్ గౌడ్ జ్ఞాపకార్థం నిత్యావసర సరుకుల పంపిణీ

-బ్యాంక్ మేనేజర్ తన తోటి ఉద్యోగులతో కలిసి అందజేత




గంభీరావుపేట తెలంగాణ పత్రిక జులై 9

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన బంగ్లా అన్వేష్ గౌడ్ అనే యువకుడు గత 15 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు తను మండలంలోని ఎస్బిఐ బ్యాంకు లో ఎఫ్ఓఎస్ గా పని చేస్తూ అందరితో మమేకమై ఉంటూ బ్యాంకు పనిపై వచ్చిన వారితో నవ్వుతూ నవ్విస్తూ విధులు నిర్వహించేవాడు కన్నీటి దీనగాధతో వారి జ్ఞాపకార్థం గురువారం రోజున ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ తోటి సహ ఉద్యోగులు కలిసి మా అనాధ వృద్ధాశ్రమంలో నిత్యవసర సరుకులను అందించారు అనంతరం వారు మాట్లాడుతూ వారి కుటుంబానికి భగవంతుడు మనోధర్యాన్ని కల్పించాలని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు లింగన్నపేట విద్యార్థి ఎంపిక



గంభీరావుపేట తెలంగాణ పత్రిక జూలై 9

రాజన్న సిరిసిల్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిడిల్ డిస్టెన్స్ విభాగంలో అండర్ 16 నందు 1000 మీటర్స్ జిల్లా స్థాయి పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లింగన్నపేటకు చెందిన 9వ తరగతి విద్యార్థి లింగం హర్ష ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు ఈనెల మెదక్ లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో హర్ష పాల్గొననున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు దాని నరేష్ తెలిపారు విద్యార్థి సాధించిన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంటి గంగారాం, తోపాటు జిల్లా ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు.

# ఘనంగా కొత్తగూడ లో మంత్రి సీతక్క పుట్టినరోజు వేడుకలు

కొత్తగూడ మండల ప్రతినిధి:- జూలై 9. (తెలంగాణ పత్రిక):-



మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంజేడు ముసలమ్మ సన్నిధిలో, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క 55వ పుట్టిన రోజు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ?మంత్రి సీతక్క జన్మదినం పురస్కరించుకొని, కొత్తగూడ మండల పార్టీ శ్రేణులు ముందుగా ముసల మ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మంత్రి సీతక్క సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాజకీయంగా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహి ంచాలని కోరుకున్నారు. అనంతరం, భారీ కేకును కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ.. తమ ఆనందాన్ని పంచుకున్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ, ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్న మా మంత్రి సీతక్క గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఇలాగే ప్రజా సేవలో ఉంటూ, మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, భగవంతుడు ఆమెకు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# ఎల్-నినో" ప్రభావంపై మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్

-వరి విస్తీర్ణం తగ్గించి ఆరుతడి పంటల వైపు వెళ్లాలని కలెక్టర్ సూచన

కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు , సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. "ఎల్-నినో" ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ పంటల మార్పు జిల్లాలో నీటి ఆవశ్యకత అధికంగా ఉన్న వరి పంట విస్తీర్ణాన్ని తగ్గించాలని సూచించారు. రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. ఆరుతడి పంటలు: మొక్కజొన్న, సోయా, పెసర్లు, అలసందలు, మినుములు, కందులు, పత్తి మరియు కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను ఎంచుకోవాలని సూచించారు. రిజర్వాయర్ల పరిస్థితి: ప్రధాన రిజర్వాయర్లైన నిజాంసాగర్, పోచారం, కౌలాస్ నాలాలో నీటి నిల్వ సామర్థ్యం మరియు నీటి ప్రవాహం తక్కువగా ఉన్నందున వరి సాగును తగ్గించాలని కోరారు.

**అవగాహన కార్యక్రమాలు:**

రైతు వేదికల్లో వ్యవసాయ మరియు నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి, రైతులకు ఆరుతడి పంటల ప్రాముఖ్యత, సాగు పద్ధతులు, ప్రభుత్వ సహాయాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి, మోహన్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ పత్రిక ప్రత్యేక దర్యాప్తు -- భాగం 1

-ఫీజుల పేరిట ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీ..?
-కొత్తగూడెంలో అధిక ఫీజులు, మౌలిక వసతుల కొరతపై తల్లిదండ్రుల ఫిర్యాదులు
-జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలంటూ విజ్ఞప్తి

కొత్తగూడెం, జూలై 09 (తెలంగాణ పత్రిక):




భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల పనితీరుపై తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్నాయి. అధిక ఫీజుల వసూళ్లు, మౌలిక వసతుల కొరత, పుస్తకాలు--యూనిఫాంల కొనుగోలుపై ఒత్తిడి, ఫీజుల బకాయిల పేరుతో విద్యా ధ్రువపత్రాల జారీ ఆలస్యం వంటి అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. తల్లిదండ్రుల ఆరోపణల ప్రకారం, ట్యూషన్ ఫీజులతో పాటు బిల్డింగ్ ఫండ్, డెవలప్మెంట్ ఫండ్, ప్రత్యేక కార్యక్రమాల ఫీజు, పరీక్ష ఫీజు పేర్లతో అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. కొన్ని విద్యాసంస్థలు తమకు అనుబంధంగా ఉన్న దుకాణాల్లోనే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని కూడా ఆరోపిస్తున్నారు. అలాగే, ఫీజుల బకాయిల కారణంగా మార్కుల మెమోలు, బదిలీ ధ్రువపత్రాలు (టీసీలు), ఇతర విద్యా ధ్రువపత్రాల జారీ ఆలస్యం అవుతోందని కొందరు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. దీంతో విద్యార్థుల ఉన్నత విద్య ప్రవేశాలు ప్రభావితమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఆట స్థలాలు, గ్రంథాలయాలు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విశాలమైన తరగతి గదులు, తగిన గాలి--వెలుతురు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆయా విద్యాసంస్థలకు అనుమతులు ఎలా మంజూరయ్యాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. చిన్నారులకు ఐఐటీ, ఫౌండేషన్, ఒలింపియాడ్ వంటి పేర్లతో ప్రచారం నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనివల్ల మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ అంశాలపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఫీజుల నిర్మాణం, మౌలిక వసతులు, ప్రభుత్వ నిబంధనల అమలును పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అనుమతులు లేని విద్యాసంస్థలను మూసివేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ పత్రిక ఈ అంశంపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, సంబంధిత ఆధారాలు, అధికారుల స్పందన, విద్యాసంస్థల వివరణలను వరుస కథనాల ద్వారా వెలుగులోకి తీసుకురానుంది. (కొనసాగుతుంది...) గమనిక: ఈ కథనంలో పేర్కొన్న అంశాలు తల్లిదండ్రులు, విద్యార్థులు చేసిన ఆరోపణల ఆధారంగా ఉన్నాయి. సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాల స్పందన అందిన వెంటనే ప్రచురించడానికి తెలంగాణ పత్రిక సిద్ధంగా ఉంది.

# కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

కామారెడ్డి జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు, కామారెడ్డి జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క జన్మదినోత్సవాన్ని ఈరోజు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీ ఏలే మల్లికార్జున్ సమక్షంలో, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు కలిసి కేక్ కట్ చేసి సీతక్క కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవకు అంకితభావంతో, నిరంతరం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీతక్క గారు మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వ కట్టుబాటు

**-సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం**

కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా – రైతులకు పంట పెట్టుబడి కోసం నేరుగా ఆర్థిక సహాయం నిధులను సకాలంలో నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈరోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ సమక్షంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు





పాలాభిషేకం నిర్వహించి, రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజాహిత నిర్ణయాలను కొనియాడారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతు భరోసా, పంట పెట్టుబడి సాయం నిధులను పారదర్శకంగా రైతుల ఖాతాల్లో జమ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు పక్షపాత వైఖరికి నిదర్శనమని అన్నారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమానికి ప్రభుత్వం సంపూర్ణ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని, రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**-పేదలు దానిని సద్వినియోగం చేసుకోవాలి**
**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి,మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హన్మంత్ రెడ్డి**
**-మంచాల మండలంలో 40మంది లబ్దిదారులకు రూ.14,47,000ల చెక్కులు మంజూరు**

ఇబ్రహీంపట్నం జూలై 09 (తెలంగాణ పత్రిక ):-

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని దానిని నిరుపేదలు సద్వినియోగం చేసుకొని సాయం పొందాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి,మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హన్మంత్ రెడ్డి అన్నారు.ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంచాల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 40 మంది లబ్దిదారులకు రూ.14 లక్షల 47



వేల రూపాయల విలువైన చెక్కులు మంజూరు కాగా ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు నూకం బాలరాజు,చిందం శ్రీశైలంల ఆధ్వర్యంలో గురువారం రోజున వాటిని లబ్దిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభు త్వం ప్రవేశపెట్టిన పథకాలు నేరుగా లబ్దిదారులకు చేరుతున్నాయని అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు.ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బైరిక రమాకాంత్ రెడ్డి,సహకార సంఘం డైరెక్టర్ పంది రమేష్,మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య,వార్డు సభ్యులు అనంగల్ల జగన్నాధం,కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య,మార సురేష్, దాసరమోని రమేష్,చెరుకు నర్సింహా,బుట్టి కృష్ణ, కంబాలపల్లి బుగ్గరాములు,కోరె బాబు,ఆరుట్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగల పరమేష్,వస్పరి కుమా ర్, తలారి కృష్ణ,నూకం మల్లేష్,లచ్చుగారి జంగారెడ్డి, దసరామోని అశోక్,జిలమోని శ్రీనివాస్,చీమర్ల క్రాంతి కుమార్, నూకం శేఖర్,ఎండి అశ్రఫ్,ఆడెపు మధు, అలువాల ప్రసాద్,దిలీప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కె.పిరాజారెడ్డి జన సేవా ట్రస్ట్' ఆధ్వర్యంలో విద్యార్థులకుడ్యూయల్ డెస్కల పంపిణీ

కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి సారథ్యంలోని కె.పిరాజారెడ్డి జన సేవా ట్రస్ట్' ఆధ్వర్యంలో గురువారం కామారెడ్డి పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ బెంచీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు విపుల్ జైన్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత కారణంగా విద్యార్థులు చదువులో వెనకబడకూడదన్నదే ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి సంకల్పమని అన్నారు. గత విద్యా



సంవత్సరంలో నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు సుమారు 5 కోట్ల రూపాయల సొంత నిధులతో డ్యూయల్ డెస్క్ బెంచీలను అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే చిన్నారులు, విద్యార్థులు నేల మీద కూర్చోకూడదనే ఉద్దేశంతో పాఠశాలలన్నింటికీ అవసరమైన డెస్కులను అందజేస్తున్నామని తెలిపారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ప్రభుత్వంపై భారం వేయకుండా, తన సొంత నిధుల ద్వారా కూడా పూర్తిస్థాయిలో కల్పిస్తారని ఆయన స్పష్టం చేశారు.


# భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**-రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్**

తెలంగాణ పత్రిక జూలై 09 జగిత్యాల ప్రతినిధి :

భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్ , రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు,



సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రీ సర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. రీ సర్వేలో పాల్గొనే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేస్తుందని తెలిపారు.భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో అసాధారణ జాప్యంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సాధారణ విధులు నిర్వహించడానికి కోర్టు ఆదేశాలు అవసరమా అని హైకోర్టు ప్రశ్నించిందని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రతి అధికారిని వివరణ కోరుతోందని, స్పందించేందుకు నాలుగు వారాల గడువు లభించిందన్నారు. రెవెన్యూ కార్యాలయం లోనూ భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, పెండింగ్ దరఖాస్తులను అత్యంత త్వరగా పరిష్కరించాలని లోకేశ్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గత రెండు నెలలుగా భూ భారతి వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు, బఫరింగ్ సమస్యలు ఎదురవుతున్నాయని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కరించిన అనేక దరఖాస్తులను కూడా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేని పరిస్థితి నెలకొందని, ఈ సాంకేతిక సమస్యలు పరిష్కారమైతే పెద్ద సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించగలమని తెలిపారు. జిల్లాలో భూధార్ ప్రాజెక్టు కింద ఎంపికైన 70 గ్రామాల్లో ఇప్పటివరకు 5 గ్రామసభలు నిర్వహించామని, మరో 65 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రతి రోజు రెండు గ్రామసభలు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఏడి (ల్యాండ్ సర్వే)కు ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, ఏడి (ల్యాండ్ సర్వే) కృష్ణ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో వన మహోత్సవం



తానూర్: 09జూలై:(తెలంగాణ పత్రిక)

పర్యావరణ పరిరక్షణకు ముక్కలు పెంపకం అవసరమని ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. మండలంలోని ఎల్వి ప్రాథమిక పాఠశాలలో పోలీసులు ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఎస్సై షేక్ జూబేర్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ లో విద్యార్థులు భాగస్వాములై విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు సుధాకర్, గ్రామ సర్పంచ్ ఈర్వంత్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన బీజేపీ ఇంచార్జ్ బోగ శ్రావణి



జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూలై 9

జగిత్యాల పట్టణంలోని 5వ వార్డ్ మరియు 49వ వార్డుల్లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి స్థానిక వార్డ్ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డా. బోగ శ్రావణి మాట్లాడుతూ ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. పార్టీ సూచనల మేరకు బీజేపీ బీఎల్ఏ ఏజెంట్లు, ఐటీ,లీగల్ సెల్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు ప్రతి బూత్ స్థాయిలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ నమోదు ప్రక్రియను విజయవంతం చేయడానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.ఓటరు జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే ప్రక్రియలో భాగంగా చనిపోయిన వారి పేర్లు, అర్హత లేని లేదా నకిలీ ఓట్లు, ఇతర ప్రాంతాలకు లేదా విదేశాలకు వెళ్లిన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునే బాధ్యతతో అవసరమైన పత్రాలను సమర్పించి, తమ పేరును ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో నమోదు ప్రక్రియను పూర్తి స్థాయిలో నిర్వహించి ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, బూత్ స్థాయి కార్యకర్తలకు కోరారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ కౌన్సిలర్ వేముల శ్రీనివాస్, 49వ వార్డ్ కౌన్సిలర్ సిరిపురపు శ్రీలత శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, కశేటి తిరుపతి, బద్దెల గంగరాజం, బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్



కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత్ భారత్ కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి యువకుల కోసం మై భారత్ పోర్టల్ ద్వారా యువకులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాల వివరాలు పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి, ఇతర జిల్లా శాఖ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక



# జాతీయ రహదారికి వెళ్లాలంటే రోడ్డు డ్రైనేజీ దుర్భర పరిస్థితి

-అయ్యప్ప స్వామి కమాన్ వద్ద పొంగిపొర్లుతున్న మురుగు
-పాదాచారులు, వాహనదారులకు నిత్యనరకం
-ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు.. శాశ్వత పరిష్కారం కోరుతున్న స్థానికులు

మేడ్చల్, జూలై 9 తెలంగాణ పత్రిక



జాతీయ రహదారి--44 పక్కన ఉన్న అయ్యప్ప స్వామి కమాన్ వద్ద గత కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లి మురుగు నీరు రోడ్డుపైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ బస్ డిపో, పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, అయ్యప్ప స్వామి ఆలయానికి వచ్చే భక్తులు ఈ మార్గాన్ని వినియోగిస్తుండగా, రోడ్డుపై నిలిచిన మురుగు నీటితో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ నీరు రోడ్డంతా వ్యాపించి దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని, పాదాచారులు మురుగు నీటిని దాటేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి శాశ్వత చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల డిమాండ్: ప్రజారోగ్యం, రహదారి భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# సర్ ప్రక్రియను పకడ్బందిగా చేపట్టాలి: కలెక్టర్ భవేశా మిశ్రా

తానూర్: 09జూలై :(తెలంగాణ పత్రిక)





ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఫారాల డిజిటలీకరణను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ భవేశామిశ్రా సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని సింగాన్ గావ్ గ్రామంలో గురువారం ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లు పూర్తి చేసి ఇచ్చిన ఎస్ఐఆర్ ఫారాలను పరిశీలించి డిజిటలికరణను, వివరాలను బిఎల్ఓ లను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పైన ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్ డిస్క్ లో అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు.అలాగే గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మౌలిక వసతులపై ప్రజల నుంచి వివరాలను సేకరించి పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మహేందర్ నాథ్,ఎంపీడీవో అమీర్ ఖాన్, గ్రామ సర్పంచ్, అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

# భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

-రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్
-భూములర్రీ సర్వే గ్రామాల్లో గ్రామసభలు ర్వహించి పజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి
-భూముల రీ సర్వే, నక్ష భూములపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవెన్యూ శాఖ కార్యదర్శి

కామారెడ్డి ,జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతిని ది)



భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కామారెడ్డి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్. అడిషనల్ కలెక్టర్ విక్టర్. ఏడి ల్యాండ్ సర్వే శ్రీనివాస్. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్ , రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు.

**జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ**

జిల్లాలో రీసర్వే పనులపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కీలక ఆదేశాలు, డైలీ ప్రోగ్రెస్ అప్డేట్, లైసెన్స్ సర్వేయర్ల సమావేశం నిర్వహణ, సి సి ఎల్ ఎహైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లాలో జరుగుతున్న రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పలు కీలక సూచనలు చేశారు. డైలీ ప్రోగ్రెస్ రిపోర్టు రీసర్వే పనుల పురోగతిని ప్రతిరోజు స్ప్రెడ్ షీట్ రూపంలో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్ల సమావేశం ఈరోజు లైసెన్స్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. రీసర్వే పనుల్లో వారి పాత్ర, బాధ్యతలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా, నాణ్యతతో పూర్తి చేయాలని, అందులో ఎలాంటి జాప్యానికి తావు ఇవ్వొద్దని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# డబుల్ బెడ్రూమ్ కాలనీ కాదు.. సమస్యల నిలయం!





-డ్రైనేజీ దుర్వాసనలో డబుల్ బెడ్రూమ్ వాసుల బతుకు!
-కోట్లతో కాలనీ.. కనీస సౌకర్యాలు మాత్రం శూన్యం!
-మురుగులో మునిగిన డబుల్ బెడ్రూమ్ కాలనీ
-అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్న డబుల్ బెడ్రూమ్ వాసులు
-అసంపూర్తి డ్రైనేజీ పనులు.. తాగునీటి కోసం తంటాలు.. అధికారుల నిర్లక్ష్యంపై కాలనీ వాసుల మండిపాటు

వెల్దుర్తిమండల ప్రతినిధి,జులై 09 (తెలంగాణ పత్రిక):

వెల్దుర్తిమండల కేంద్రంలోని డబుల్ బెడ్రూమ్ కాలనీ ప్రస్తుతం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. పేదలకు మెరుగైన జీవనం అందించాలనే లక్ష్యంతో నిర్మించిన కాలనీ, నేడు దుర్వాసన, మురుగునీరు, తాగునీటి కొరతతో ప్రజలకు నరకయాతనగా మారిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమని వారు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. కాలనీలో నిర్మించాల్సిన డ్రైనేజీ వ్యవస్థను కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మధ్యలోనే వదిలేయడంతో మురుగునీరు సెప్టిక్ ట్యాంకులకు చేరకుండా రోడ్లపైకి, ఇళ్ల మధ్యకు చేరుతోంది. ఎక్కడ చూసినా మురుగునీరు నిల్వ ఉండటంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విపరీతంగా పెరిగి చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో పొలాల వద్ద నుంచి నీటిని మోసుకొచ్చే పరిస్థితి నెలకొంది. కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ గృహాల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడం ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. “ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన నాయకులు ఇప్పుడు మా కాలనీ వైపు కూడా చూడటం లేదు. ప్రజల సమస్యలు వినడానికి ఎవరూ ముందుకు రావడం లేదు” అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో ఉన్నా సంబంధిత శాఖలు స్పందించకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ వ్యవస్థను పూర్తిచేయడం, మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించడం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

## వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి




ముధోల్:09జూలై(తెలంగాణ పత్రిక)

వన మహోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విట్టోలి సర్పంచ్ కాలేవార్ రుచిత-దిగంబర్ అన్నారు. గురువారం మండలంలోని విట్టోలి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ మొక్కలను నాటి నీటిని పోశారు. దీంతో గ్రామస్తులకు మొక్కలను అందజేసి మాట్లాడారు. ప్రతి ఇంటింటికి మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇంటి ఆవరణలో మొక్కలను నాటే బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో ముఖ్యమని, రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివరాజ్, పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను పరిశీలించిన కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం పరిశీలించారు. ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి, నిరంతర పర్యవేక్షణ కొనసాగించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గోదాం పరిసర ప్రాంతాల భద్రత, రికార్డుల నిర్వహణ, సీలింగ్ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు.

## డీసీసీ కార్యవర్గ సభ్యులకు నియామక ఉత్తర్వుల అందజేత

-పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని డీసీసీ అధ్యక్షులు శ్రీ ఏలే మల్లికార్జున్ పిలుపు




కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈరోజుఈరోజు డీసీసీ కార్యవర్గ సభ్యులకు నియామక పత్రలను కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా ప్రతి కార్యవర్గ సభ్యుడు పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల విస్తరణ మరియు సంస్థాగత నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న సర్ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని, ప్రతి కార్యవర్గ సభ్యుడు తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మండల అధ్యక్షులతో సమన్వయం చేసుకొని గ్రామ గ్రామాన పర్యటించి నిర్వహిస్తూ ప్రక్రియను వేగవంతం చేసి జిల్లాలో 100 శాతం పూర్తి చేసే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చిన డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ప్రజలతో నిరంతరం మమేకమై కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తలసేమియా లైఫ్ సేవర్ అవార్డును అందుకున్న వాసవి క్లబ్ బీబీపేట్

**-తల సేమియా చిన్నారుల ప్రాణాలను కాపాడినందుకు**

**-అవార్డును అందజేసిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు**

కామారెడ్డి ,జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 120 యూనిట్ల రక్తాన్ని సేకరించిన వాసవి క్లబ్ బీబీపేట్ కు తల సేమియా లైఫ్ సేవర్ అవార్డ్ 2026 ను ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు,కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ అమ్మద్ లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాలు,జమీల్ అహ్మద్ లు మాట్లాడుతూ తల సేమియా వ్యాధితో బాధపడుతున్న కోసం 2025 వ సంవత్సరంలో 120 యూనిట్ల



రక్తాన్ని సేకరించి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల వాసవి క్లబ్ లలో మొదటి స్థానంలో నిలిచిన వాసవి క్లబ్ బీబీపేట్ కు తల సేమియా లైఫ్ సేవర్ అవార్డును అందజేయడం జరిగిందని,తల సేమియా బాధిత చిన్నారులకు ప్రతి 15 రోజులకు జీవితాంతం రక్తం అవసరమని అలాంటి చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం ముందుకు వచ్చిన వాసవి క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు ప్రతి సంవత్సరం ఒక రక్తదాన శిబిరాన్ని చిన్నారుల కోసం నిర్వహించాలని విజ్ఞప్తి చేయగా దానికి సానుకూలంగా స్పందించి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని తెలియజేయడం జరిగింది. ఇప్పటివరకు 6000 యూనిట్లకు పైగా రక్తాన్ని తలసేమియా బాధిత చిన్నారుల కోసం సేకరించడం జరిగిందని అన్నారు. రక్తదాన శిబిరాలను నిర్వహణకు యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడు పర్ష వెంకటర మణ, వాసవి క్లబ్ అధ్యక్షుడు మురికి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శెట్టి శ్రీనివాస్,వైస్ గవర్నర్ భాశెట్టి నాగేశ్వర్, జోనె చైర్మన్ తడుపునూరి నాగభూషణం,విశ్వ మోహన్, నంగునూరి చంద్ర శేఖర్,బచ్చు రామచందం, నీల బైరయ్య,రెడ్డి శెట్టి వెంకటేశం,పెద్ది నాగయ్య, ఇల్లందులో ఆంజనే యులు, తొడుపునూరి శ్రీనివాస్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఓటర్ల ఎన్యుమరేషన్ గడువును మరో నెల రోజులు పొడిగించాలి

**-డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీను.**

మాడ్గులపల్లి//నల్గొండ// జులై9:(తెలంగాణ పత్రిక):-

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల ఎన్యుమరేషన్ సర్ ప్రక్రియను మరో నెలరోజుల పాటు పొడిగించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీను కోరారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎన్యుమరేషన్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో తీవ్ర జాప్యం గందరగోళం నెలకొందన్నారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తిస్థాయిలో గ్రామాలలో ప్రజలకు చేరలేదు అని బతుకుదెరువు కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిన వారికి సమాచారం అంది తిరిగి సొంత గ్రామాలకు చేరుకొని ఎన్యూమరేషన్ ఫారం లు తీసుకోవడం లో కొంచెం జాప్యం జరిగే అవకాశం ఉందని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గడువును ఆగస్టు 30 వరకు పెంచాలని వారు కోరారు.30 శాతం మందికి ఎన్యుమరేషన్ ఫారాలు చేరలేదని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ



పనులు ఊపందుకున్నాయి. దీంతో ప్రజలు ఈ ప్రక్రియపై దృష్టి సారించడం కష్టంగా మారింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ పట్ల సామాన్య ప్రజల్లో సరైన అవగాహన లేదు. ఫారాలు నింపే విషయంలో ప్రజలు అనేక అనుమానాలకు, అపోహలకు లోనవుతున్నారని , ఓటర్ల అనుమానాలను నివృత్తి చేసే విషయంలో కొంత అవగాహన లోపం కనిపిస్తుందనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు వివరాలు నమోదు చేసి బీఎల్‌వోలకు అందజేయడానికి మరింత సమయం అవసరం ఉంది.ఈ నేపథ్యంలో ప్రజలంతా తమ వివరాలను నమోదు చేసుకునేందుకు వీలుగా ఎన్నికల కమిషన్ వెంటనే గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టి అపోహలను తొలగించి సర్ ప్రక్రియను సరళతరం చేయాలి. ఈ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఎన్యూమరేషన్ గడువును మరో నెల రోజుల పాటు అంటే ఆగస్టు 30 వరకు పొడిగించాలని వారు కోరారు.

# నూతన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సమకూర్చిన డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ కి ఘన సన్మానం

కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీకి నూతన జిల్లా కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో విశేష కృషి చేసిన కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ నికామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు కామారెడ్డి జిల్లాలోని అన్ని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఘనంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జిల్లా కాంగ్రెస్ పార్టీకి సొంత కార్యాలయం ఏర్పాటుకు డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ చేసిన కృషి పార్టీ చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు. పార్టీ సంస్థాగత




బలోపేతానికి, నాయకులు--కార్యకర్తలకు ఒకే వేదికను కల్పించడంలో ఈ నూతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్పందించిన డీసీసీ అధ్యక్షులు శ్రీ ఏలే మల్లికార్జున్ గారు, ఈ సన్మానం తనకు వ్యక్తిగతంగా లభించిన గౌరవం కాదని, కాంగ్రెస్ పార్టీపై ఉన్న విశ్వాసానికి, పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషికి లభించిన గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలి

తెలంగాణ పత్రిక నిజామాబాద్, జూలై 09 :

పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తూ, నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఎస్ఐఆర్ లో భాగంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియలను కలెక్టర్ గురువారం పలు ప్రాంతాల్లో సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజామాబాద్ రూరల్ పరిధిలోని గాంధీనగర్ తండా, గూపన్ పల్లి గ్రామాలలో, నిజామాబాద్ నగరంలోని శంకర్ భవన్ పాఠశాలలో ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ వివరాల, నమోదు తీరును నిశితంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఎంత శాతం పూర్తయ్యింది, ఓటర్లు అందరికీ ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ పూర్తయిందా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో లేని ఓటర్లకు కూడా సమాచారం అందించాలని, గడువు లోపు వారు తమ ఎన్యూమరేషన్ ఫారంలు తిరిగి అందించేలా చూడాలన్నారు. జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారి ఎన్యూమరేషన్ ఫారంలను జాగ్రత్తగా పరిశీలించాలని, వివరాలు సరి చూసుకున్న మీదట వారి కుటుంబ సభ్యుడి సంతకంతో తీసుకోవచ్చని కలెక్టర్ బీఎల్ఓ లకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ ను




ఏకకాలంలో సమాంతరంగా నిర్వహించాలని అన్నారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలో పొందుపర్చిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని బీఎల్ఓ సూపర్వైజర్లను ఆదేశించారు. ఓటర్లతో మర్యాదపూర్వకంగా మెలగాలని, ఓటరు మ్యాపింగ్ విషయంలో సహకారం అందించాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ దగ్గర ఓటరు జాబితా తప్పనిసరిగా ఉండాలని అన్నారు. చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తిస్తూ, ఓటరు జాబితాలో మార్కింగ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా, సకాలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లు బీఎల్ఓ లకు తగిన సహకారం అందించాలని అన్నారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, తహసీల్దార్ వినయ్ సాగర్ తదితరులు ఉన్నారు.

# బడిబాట నమోదులో ప్రథమ స్థానంలో నిలవాలి

**-కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**




కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

బడిబాట నమోదులో కామారెడ్డి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగ్వాన్ గారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో మన కామారెడ్డి జిల్లా నాలుగవ స్థానంలో నిలిచింది. గత సంవత్సరం కంటే అదనంగా 10 శాతం విద్యార్థుల నమోదు లక్ష్యాన్ని అధిగమించిన మాచారెడ్డి మండల విద్యాధికారి సురభి దేవేందర్ రావు, తాడ్వాయి మండల విద్యాధికారి రామస్వామి, కల్వరాల కాంప్లెక్స్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విష్ణు వర్ధన్ రెడ్డి, ఎర్రాపహాడ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంగారెడ్డిని కలెక్టర్ సన్మానించారు. బడిబాటలో విద్యార్థులను నమోదు పెంపు కార్యక్రమాన్ని ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రతిష్టాత్మకంగా స్వీకరించి తమకు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని కలెక్టర్ సార్ కోరడం జరిగింది. కామారెడ్డి జిల్లాను విద్యారంగంలో ఉన్నత స్థాయిలో ఉండే విధంగా కృషి చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ శ్రీ గిరి జిల్లా విద్యాధికారి మల్లిఖార్జున్, సమగ్ర శిక్ష సమన్వయ కర్తలు నాగవేందర్, వేణు గోపాల్ పాల్గొన్నారు.

# సదాశివ నగర్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ మండల అధ్యక్షులుగా రుస్తుం నవీన్ రావు

కామారెడ్డి, జూలై 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల్ కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులను నియమించడం జరిగింద నిటిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యే మదన్మోహన్ మరియు డిసిసి అధ్యక్షులు ఆదేశాలను అనుసారం. భూంపల్లి గ్రామానికి చెందిన రుస్తుం నవీన్ రావును. సదాశివనగర్ మండల కాంగ్రెస్ పార్టీ మండల బిసి సెల్ అధ్యక్షులుగా నియమించడం జరిగిందింది. ఈ సందర్భంగా రుస్తుం నవీన్ రావు మాట్లాడుతూ నాపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులుగా నియమించిన. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ఎమ్మెల్యే మదన్ మోహన్. కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున. సదాశివ నగర్ మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులను ఆదుకోండి: మంత్రి తుమ్మలను కోరిన తాటి



తెలంగాణ పత్రికదదమ్మపేట, జూలై 9

పెద్దవాగు ప్రాజెక్ట్ గండిపడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయకట్టు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, పెద్దవాగు ప్రాజెక్ట్ దెబ్బతినడంతో ఆయకట్టు రైతులు వరుసగా మూడు పంట సీజన్లుగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్చించి, పెద్దవాగు ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులను అత్యవసరంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులతో కలిసి త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగునీటి ఇబ్బందులను నేరుగా వివరించనున్నట్లు తాటి వెంకటేశ్వర్లు తెలిపారు.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం...
# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





**-తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు ఆశీర్వాద సభకు చింతకాని వేదిక..**
**-9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ..**
**-తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టాలి..**
**-150 స్టాల్స్ ఏర్పాటు అంచనాలకు మించి 11 వేల మంది రైతుల హాజరు..**
**-మెగా రైతు మేళాలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

తెలంగాణ పత్రిక జూలై 9 ఖమ్మం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రివర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వమని అన్నారు.

దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, కడెం వంటి సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోవడం ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. ప్రభుత్వానికి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేశామని తెలిపారు. వ్యవసాయ ఆధునికీకరణ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నామని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి సహా తెలంగాణ మంత్రివర్గం మొత్తం హాజరవుతుందని అన్నారు. ప్రస్తుతం రైతులకు అందుతున్న ప్రతి నీటి చుక్క కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే వస్తోందని తెలిపారు. రైతులను మాయమాటలతో మోసం చేసే పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వబోరని అన్నారు. రైతు సంక్షేమానికి పునాదులు వేసిన ప్రభుత్వాలను రైతులే కాపాడుకుంటారని, ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న అబద్ధాలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. చింతకాని మండలంలో మూడు లక్షల మంది రైతులతో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు అందించాలనే లక్ష్యంతో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతుల అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని, శాస్త్రవేత్తలు చెప్పే అంశాలను రైతులు శ్రద్ధగా విని గ్రామాలకు తీసుకెళ్లాలని కోరారు. ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఫిషరీస్, హార్టికల్చర్ తదితర అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జూన్ 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా జూలై 10వ తేదీకి వాయిదా పడిందన్నారు. తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందించాలని చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుంటూ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలిస్తున్నామని, దీంతో వర్షాలతో సంబంధం లేకుండా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేయలేదని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు డిప్యూటీ సీఎం రూ.5 వేల కోట్లు కేటాయించి మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు. మొక్కజొన్నతో పాటు జొన్న, సోయా తదితర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతుల ఖాతాల్లో మద్దతు ధర చెల్లింపులు రేపటిలోగా జమ చేస్తామని స్పష్టం చేశారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభ చారిత్రక ఘట్టమని, రైతులకు అవసరమైన ప్రతి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాది మంది రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఉద్యమాలు, పోరాటాలు, వ్యవసాయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఘన చరిత్ర ఉందని, జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందన్నారు. సంప్రదాయ పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా వచ్చే వేతనం కంటే ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రకృతి సహకరించక పోయినా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమకూరుస్తున్నామని, యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా యాప్ వల్ల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. రైతులకు వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రపంచంలో ఉన్న అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభ నిర్వహణకు అద్భుతమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించేందుకు ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదర్శ రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలను ఇతర రైతులకు పరిచయం చేయడం కూడా ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పంట మార్పిడి విధానం అమలు చేయడం, ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెగా రైతు మేళాకు 5 వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా దాదాపు 11 వేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. రైతుల కోసం ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాలను ప్రదర్శనకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ఎలా వినియోగించు కోవాలి అనే అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్నారని, 'రైతు ఆశీర్వాదం' పేరుతో మూడు లక్షల మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## 56 లక్షల విలువ చేసే 113 కేజీల గంజాయి పట్టివేత

**-నలుగురు నిందితులు అరెస్ట్...పరారీ మరో ఇద్దరు..**
**-ఇన్స్పెక్టర్ బాలకృష్ణ..**



తెలంగాణ పత్రిక జూలై 9 ఖమ్మం

విశ్వసనీయ సమాచారం మేరకు టౌన్ ఏసీపీ రమణమూర్తి ఆదేశాల మేరకు బుధవారం రాత్రి సమయంలో ఖమ్మం బైపాస్ రోడ్డులో తిరుమల రోలింగ్ షట్టర్ ఇంజనీరింగ్ వర్క్స్ వద్ద ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, ఈగిల్ టీమ్ సిఐ విజయ్, టూ టౌన్ ఎస్ఐ వి. రమేష్, పోలీస్, ఈగిల్ టీమ్ సిబ్బంది సంయుక్తంగా నిఘా పెట్టి, అనుమానస్పదంగా వస్తున్న నిందితుల వాహనాలను అడ్డగించి, తనిఖీలు నిర్వహించి సుమారు 56 లక్షల విలువ చేసే 113 కేజీల గంజాయి అక్రమ రవాణాను పట్టుకున్నట్లు ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన నిందితులు ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా నుండి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, వారు అద్దెకు తీసుకున్న రెండు వాహనాల డిక్కీ, డ్యాష్‌బోర్డులలో రహస్యంగా దాచి మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న పోలీస్ అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రత్యేకంగా అభినందించారు. పరారీలో ఉన్న మిగిలిన ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు.

**అరెస్ట్ అయిన నిందితులు:**

రవి జాదవ్ (28), గోపీనాథ్ సుక్లే (55), సంతోష్ థాయప్ప (40), మోహన్ భీకాజీ జాదవ్ (36) -- అందరూ ఉస్మానాబాద్ జిల్లా, మహారాష్ట్ర నివాసితులని వివరించారు. పరారీలో ఉన్న నిందితులు : బసు ఏ వాసు (గంజాయి సప్లయర్, అల్లూరి జిల్లా, ఆంధ్రాప్రదేశ్), భావూసాహెబ్ యాదవ్ క్షీరసాగర్ (అద్దె కారు యజమాని).

**రికవరీ చేసుకున్న సొత్తు:**

113.025 కిలోల గంజాయి (53 బ్రౌన్ టేప్ ప్యాకెట్లు) -- సుమారు విలువ రూ. 56,50,000/-.
2 వాహనాలు:
మారుతి ఎర్టిగా,
టాటా ఆరియా.
4 మొబైల్ ఫోన్లు,
రూ. 850/- నగదు. వివరాలు తెలిపారు.

## విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం

**-పోలీసుల ప్రతిభను వెలికితీసేందుకే పోలీస్ డ్యూటీ మీట్**




తెలంగాణ పత్రిక నిజామాబాద్ జులై 09:

పోలీస్ విధినిర్వహణలో సామర్ధ్యం పెంచడానికి తెలంగాణా రాష్ట్రంలో మూడవ పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహణలో భాగంగా శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేటులో కార్యాలయంలో జోన్ 2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ - 2026 కార్యాక్రమం ( నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, అదిలాబాద్ జిల్లాల ) పోలీస్ డిపార్ట్మెంట్ లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ద్వారా పోలీస్ విభాగంలో కానిస్టేబుల్ స్థాయి నుండి సి.ఐ స్థాయి వరకు పనిపద్ధతులు మెరుగుపడి ఇన్వేస్టిగేషన్ స్థాయిలు పెరుగుతాయన్నారు , పనిలో పోటీతత్వం అలవాటుపడు తుందనీ. సైంటిఫిక్ ఇన్వేస్టిగేషన్ , ఫారంసిక్ , ఫింగర్ ప్రింట్ ఇన్వేస్టిగేషన్ కోసం ఎంపికలో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమీషనరేటులో నేరాలు జరిగినప్పుడు అట్టి నేరస్థలంలో సేకరించవలసిన నేర సమాచారం కోసం " పోలీస్ క్లూస్ " ఏ విధంగా సేకరించాల అనేదాని కోసం ఎంపిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పోలీస్ హెడ్ క్వార్టర్ గ్రౌండ్ , పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యలయం , పోలీస్ కార్యాలయం లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, సమక్షంలో సి.ఐలు , ఎస్.ఐలు మరియు సిబ్బందికి ఎంపిక పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఇందులో సైంటి ఫిక్ ఎయిడ్స్ టూ ఇన్వెస్టగేషన్, కంప్యూటర్స్ , డాగ్ స్క్వాడ్ , ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ , ఎక్స్ ప్లోజింగ్ ,నార్కోటిక్, ఫింగర్ ప్రింట్స్ , ఫోరెన్సిక్ మెడిసిన్ , తదితర అంశాల కోసం ఎంపికలు నిర్వహించడం జరిగింది. ఈ ఎంపికలు రెండు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలను సైన్స్ ఇన్వెస్టిగేషన్ టూల్ గా మార్చుకోవడం కోసం తమను తాము మెరుగుపరుచుకుని ఉత్తమ ప్రతిభ కనబరచడం కోసం తద్వారా కన్వెన్షన్ పెంచడం కోసం ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు.ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలోనూ రాణించి మంచి పేరు తీసుకురావాలని పోలీస్ కమీషనర్ ఆకాంక్షించారు.

# బిజినెస్

## చమురు షాక్ ప్రభావం స్వల్పమే.. భారత ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ ధీమా




పశ్చిమాసియా ఘర్షణల కారణంగా అంతర్జాతీయ చమురు ధరలు పెరిగినా భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేర్కొంది. తాజా 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' నివేదికలో 2026 సంవత్సరానికి భారత వృద్ధి అంచనాను 6.4 శాతానికి స్వల్పంగా తగ్గించినప్పటికీ, 2027లో వృద్ధి మరింత బలపడుతుందని వెల్లడించింది. దేశీయ డిమాండ్ బలంగా ఉండటం, ఇటీవలి ఆర్థిక గణాంకాలు ఆశాజనకంగా ఉండటం భారత ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని ఐఎంఎఫ్ వివరించింది. ఐఎంఎఫ్ రీసెర్చ్ విభాగం అధికారి డెనిజ్ ఇగాన్ మాట్లాడుతూ.. తాజా ఆర్థిక సూచీలు భారత ఆర్థిక వ్యవస్థలో నిలకడను చూపిస్తున్నాయని తెలిపారు. అయితే పశ్చిమాసియా ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరలు, వాటి ప్రభావం దేశీయ ఇంధన ధరలపై పడటం వల్ల 2026 వృద్ధి అంచనాను స్వల్పంగా తగ్గించాల్సి వచ్చిందన్నారు. ఈ ఇంధన ఒత్తిడి 2027 నాటికి తగ్గుముఖం పట్టడంతో భారత వృద్ధి మళ్లీ 6.5 శాతం స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఐఎంఎఫ్ తాజా అంచనాలు విడుదల చేసింది. 2026లో ప్రపంచ వృద్ధి 3 శాతం, 2027లో 3.4 శాతంగా ఉంటుందని తెలిపింది. అయితే పశ్చిమాసియా ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చితే చమురు ధరలు పెరగడంతో పాటు ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మరోవైపు కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో పెరుగుతున్న పెట్టుబడులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొంత ఊతమిస్తున్నాయని కూడా ఐఎంఎఫ్ పేర్కొంది.

## టవర్లు లేకున్నా కాల్స్- బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్ వచ్చేసింది!

-ఫోన్ ధర రూ.1.34 లక్షలుగా నిర్ణయం
-కొనుగోలుకు డాట్ అనుమతి తప్పనిసరి
-రక్షణ, విపత్తు సేవలకు ప్రత్యేకంగా రూపకల్పన
-దేశవ్యాప్తంగా 4జీ విస్తరణ కొనసాగిస్తున్న బీఎస్ఎన్ఎల్

మొబైల్ టవర్ సిగ్నల్ అందని ప్రాంతాల్లో కూడా కాల్స్ చేసుకునే అవకాశం కల్పిస్తూ బీఎస్ఎన్ఎల్ కొత్త శాటిలైట్ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అడవులు, సముద్ర ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, విపత్తులు సంభవించిన చోట్ల కూడా ఈ ఫోన్‌తో మాట్లాడొచ్చు. అయితే ఇది సాధారణ స్మార్ట్‌ఫోన్‌లా ఎవరైనా కొనుగోలు చేసే అవకాశం మాత్రం లేదు. ఈ ఫోన్ ధర రూ.1,34,166. కొనుగోలు చేయాలంటే ముందుగా కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ (డాట్) నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతి లేకుండా శాటిలైట్ ఫోన్‌ను ఉండటం లేదా వినియోగించడం చట్టపరమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని బీఎస్ఎన్ఎల్ తెలిపింది. సాధారణ మొబైల్ ఫోన్లు సమీపంలోని టవర్ల ద్వారా పనిచేస్తాయి. కానీ ఈ శాటిలైట్ ఫోన్ నేరుగా ఉపగ్రహాలతో అనుసంధానం అవుతుంది. అందుకే సెల్యులర్ నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో కూడా వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. ఈ సేవల కోసం అంత ర్జాతీయ శాటిలైట్ నెట్‌వర్క్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ వెల్లడించింది. ఈ ఫోన్‌లో అత్యవసర పరిస్థితుల కోసం ఎస్ఓఎస్ ఫీచర్‌ను కూడా అందించారు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఎక్కువసేపు పనిచేసే బ్యాటరీ, కఠిన పరిస్థితులను తట్టుకునే బలమైన డిజైన్‌ను ఇందులో పొందుపరిచారు. అత్యవసర కమ్యూనికేషన్‌ను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించారు. రక్షణ శాఖ, సముద్ర రవాణా, విపత్తు నిర్వహణ బృందాలు, గనుల పరిశ్రమ, మారుమూల ప్రాంతాల్లో పనిచేసే సంస్థలు, సాహస




యాత్రికులు, దూర ప్రాంతాలకు వెళ్లే యాత్రికులను దృష్టిలో పెట్టుకొని ఈ ఫోన్‌ను రూపొందించినట్లు బీఎస్ఎన్ఎల్ తెలిపింది. సాధారణ వినియోగదారుల కోసం కాకుండా ప్రత్యేక అవసరాలున్న వారికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. ఇదిలా ఉండగా దేశవ్యాప్తంగా 4జీ సేవల విస్తరణపైనా బీఎస్ఎన్ఎల్ దృష్టి పెట్టింది. ఇప్పటికే దాదాపు 99 వేల 4జీ సైట్లను ప్రారంభించినట్లు సంస్థ వెల్లడించింది. మరిన్ని 4జీ టవర్ల ఏర్పాటుకు కూడా కేంద్రం అనుమతించే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది.

## భారత్‌తో వాణిజ్య ఒప్పందం.. న్యూజిలాండ్ వ్యాపారాలకు భారీ ఊతం: లక్సన్

భారత్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) న్యూజిలాండ్ వ్యాపారాలకు భారీ అవకాశాలు తీసుకురానుందని ఆ దేశ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ తెలిపారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన తొలి రోజునే న్యూజిలాండ్ ఎగుమతుల్లో 57 శాతం వస్తువులు సుంకం లేకుండా భారత్‌లోకి ప్రవేశిస్తాయని వెల్లడించారు. ఈ మేరకు లక్సన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ "భారత్‌తో వాణిజ్య ఒప్పందం న్యూజిలాండ్ వ్యాపారాలకు కొత్త దారులు తెరుస్తుంది" అని పేర్కొన్నారు. భారత్ వేగంగా విస్తరి స్తున్న వినియోగదారుల మార్కెట్‌గా మారుతోందని తెలిపారు. ఈ ఎఫ్‌టీఏ తమ దేశ ఆర్థిక ప్రయోజ నాలకు కీలకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జులై రేపు, ఎల్లుండి న్యూజిలాండ్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. దాదాపు 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని న్యూజిలాండ్‌కు అధికారిక పర్యటన నిమిత్తం వెళ్లడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని మోదీ తెలిపారు. 2025 మార్చిలో భారత్‌కు వచ్చిన లక్సన్ పర్యటన తర్వాత ద్వైపాక్షిక సంబంధాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 27న భారత్, న్యూజిలాండ్ మధ్య కీలక ఎఫ్‌టీఏపై తుది నిర్ణయం తీసుకున్నారు. దీన్ని "తరతరాలకు ఉపయోగపడే అవకాశం"గా లక్సన్ అభివర్ణించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఎదుగుతున్న వేళ ఆ



ప్రయాణంలో భాగస్వామ్యం కావడానికి ఈ ఒప్పందం న్యూజి లాండ్‌కు తోడ్పడుతుందని ఆయన అన్నారు. అటు, భారత్- న్యూజిలాండ్ సంబంధాల్లో ప్రవాస భారతీయుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమని మోదీ గుర్తుచేశారు. న్యూజిలాండ్‌లో వివిధ రంగాల్లో రాణిస్తున్న భారతీయులను కలవాలని తాను ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

## వరుస ఓటములకు బ్రేక్ పడేనా? బరిలోకి దిగే భారత తుది జట్టు ఇదే!

స్పోర్ట్స్ డెస్క్:
శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు గురువారం ఇంగ్లండ్‌తో నాల్గో టీ20 పోరుకు సిద్ధమైంది. తొలి మ్యాచ్ వర్షం వల్ల రద్దు కాగా, తర్వాతి రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ప్రస్తుతం ఇంగ్లండ్ 2-0 ఆధిక్యంలో ఉంది. ముఖ్యంగా మూడో టీ20లో టీమిండియా కేవలం 76 పరుగులకే కుప్పకూలి, 125 పరుగుల భారీ తేడాతో ఘోర ఓటమి చవిచూసింది. కనీసం ఒక్క బ్యాటర్ కూడా 15 పరుగుల మార్కును దాటలేకపోవడం జట్టు బ్యాటింగ్ వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో సిరీస్‌ను కాపాడుకునేందుకు తుది జట్టులో కొన్ని కీలక మార్పులు చేసేందుకు టీమిండియా మేనేజ్‌మెంట్ సిద్ధమైనట్లు తెలుస్తోంది.ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఆకట్టుకోలేకపోయిన తిలక్ వర్మ (13, 24ి, 3 పరుగులు) స్థానంలో అనుభవజ్ఞుడైన సంజూ శాంసన్‌ను మిడిల్ ఆర్డర్‌లో ఆడించే యోచనలో టీమిండియా మేనేజ్‌మెంట్ ఉందని సమాచారం. ఓపెనర్లుగా అభిషేక్ శర్మతో పాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరో అవకాశం అందుకోనున్నాడు. వైభవ్ గత రెండు మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు చేయకపోయినా (14, 13 పరుగులు), అతని హిట్టింగ్ సామర్థ్యంపై నమ్మకం ఉంచారు. వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ మూడో స్థానంలో, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాల్గో స్థానంలో బరిలోకి దిగనున్నారని తెలుస్తోంది. ఆల్‌రౌండర్ల విభాగంలో శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణాలు తమ స్థానాలను నిలబెట్టుకోనున్నారు. ఇక బౌలింగ్ విభాగంలో పేసర్లుగా అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్ బాధ్యతలు పంచుకోనుండగా, స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తి జట్టులో కొనసాగే అవకాశం ఉందని క్రీడా




వర్గాలు అభిప్రాయప డుతున్నాయి. బ్యాటింగ్ పటిష్ఠతను పెంచుకుని, వరుస ఓటములకు అడ్డుకట్ట వేయాలని భారత్ పట్టుదలగా ఉంది.

-భారత తుది జట్టు (అంచనా):
అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), సంజూ శాంసన్/తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి.

## ఈజిప్ట్ ఆరోపణలను కొట్టిపారేసిన ఫిఫా రిఫరీయింగ్ చీఫ్

స్పోర్ట్స్ డెస్క్:
ఫిఫా ప్రపంచకప్ 2026లో భాగంగా అర్జెంటీనా, ఈజిప్ట్ జట్ల మధ్య జరిగిన రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్ వివాదస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఈజిప్ట్ తొలి అర్ధలో 2-0 ఆధిక్యంలో నిలిచినప్పటికీ, అర్జెంటీనా అద్భుతంగా పుంజుకుని 3-2 తేడాతో విజయాన్ని అందుకుంది. అయితే, ఇంజూరీ టైమ్‌లో ఎంజో ఫెర్నాండెజ్ కొట్టిన విన్నింగ్ గోల్‌తో ఈజిప్ట్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ ఓటమిపై ఈజిప్ట్ ఫుట్‌బాల్ అసోసియేషన్, కోచ్ హోసామ్ హసన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రిఫరీ నిర్ణయాలు అర్జెంటీనాకు అనుకూలంగా ఉన్నాయని, వారిని టోర్నీలో ఉంచడానికే ఒత్తిడికి లొంగి పక్షపాతంగా వ్యవహరించారని ఆరోపించారు.ఈ ఆరోపణలపై ఫిఫా రిఫరింగ్ చీఫ్ పీర్‌లూయిగి కొలినా ఇవాళ( గురువారం) స్పందించారు. మ్యాచుల విషయంలో అంపైర్ల నిర్ణయాలు పూర్తిగా స్వతంత్రమైనవని, వారి చిత్తశుద్ధిని ఎవరూ ప్రశ్నించలేరని స్పష్టం చేశారు. 'ఫుట్‌బాల్‌లో నిర్ణయాలపై చర్చ సహజం. కానీ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరైనది కాదు. ఫిఫా అధ్యక్షుడే స్వయంగా చెప్పినా రిఫరీల నిర్ణయాలను ప్రభావితం చేయలేరు' అని కొలినా తేల్చిచెప్పారు. వీఏఆర్ రివ్యూలో అర్జెంటీనా డిఫెండర్ లిసాంద్రో మార్టినెజ్‌పై ఈజిప్ట్ ఆటగాడు ఫౌల్ చేసినట్లు స్పష్టంగా తేలిందని, అందుకే ఆ గోల్‌ను రద్దు చేశామని ఆయన పేర్కొన్నారు. అలాగే సలా




విషయంలో జరిగింది సాధారణ ఫుట్‌బాల్ కాంటాక్ట్ మాత్రమేనని, అక్కడ ఫౌల్ లేదని పేర్కొన్నారు. ఇలాంటి నిరాధార ఆరోపణల కారణంగా రిఫరీలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# స్పోర్ట్స్

## గొప్ప కెప్టెన్ అవుతాడు.. శ్రేయస్‌కు మద్దతుగా నిలిచిన సోదరి శ్రేష్ఠ




స్పోర్ట్స్ డెస్క్:
టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు వరుసగా పరాజయాలు ఎదురవు తున్నాయి. ఐర్లాండ్ టూర్‌తో తొలిసారి జాతీయ జట్టు పగ్గాలు అందుకున్న శ్రేయస్ వరుస ఓటములు పలకరిస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో అతడికి సోదరి శ్రేష్ఠ అయ్యర్ మద్దతుగా నిలిచింది. అంతేకాక భారత క్రికెట్ లెజెండ్స్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, సచిన్ టెండూల్కర్‌ల కెప్టెన్సీ ఓటములను ఉదాహరణగా చూపించి.. తన సోదరుడిని విమర్శించే వారికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది.ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న శ్రేష్ఠ అయ్యర్ పలు విషయాలను వెల్లడించారు. ' సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ..వీళ్లంత క్రికెట్ లెజెండ్స్. వీళ్లు కూడా తమ కెరీర్‌లో ఎన్నో మ్యాచ్‌లు ఓడిపోయారు. కానీ ప్రతిసారీ శ్రేయస్‌నే విమర్శించడం సరికాదు. అలా చేస్తే సమస్య అతడిలో కాకుండా విమర్శించే వారిలోనే ఉండొచ్చు' అని ఆమె వ్యాఖ్యానించింది. మరోవైపు నెటిజన్లు శ్రేయస్‌ను దిగ్గజాలతో పోల్చొద్దని చెప్పినప్పటికీ.. శ్రేష్ఠ మాత్రం? తన సోదరుడిపై సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేసింది. 'శ్రేయస్ గొప్ప వ్యక్తిత్వం కలిగిన ఆటగాడు. అతడిలోచాలా ప్రతిభ ఉంది. సరైన సమయం వచ్చినప్పుడు అతడే భారత అత్యుత్తమ కెప్టెన్లలో ఒకడిగా గుర్తింపు పొందుతాడని నేను బలంగా నమ్ముతున్నాను' అని పేర్కొంది. మరోవైపు వరుస వైఫల్యాలు ఎదురైనా శ్రేయస్ అయ్యర్‌పై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు జట్టు మేనేజ్‌మెంట్ విశ్వాసం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్2028ను దృష్టిలో పెట్టుకుని యువ జట్టుతో కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్న నేపథ్యంలో శ్రేయస్‌కు మరిన్ని అవకాశాలు లభించే అవకాశం ఉందని క్రీడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

# ‘మైసా’ కోసం రష్మిక సాహసం అండర్‌వాటర్‌లో భారీ ఫైట్!

-‘మైసా’ చిత్రం కోసం అండర్‌వాటర్ ఫైట్ పూర్తి చేసిన రష్మిక
-ఇండియన్ సినిమాలో ఇదే తొలి ఫిమేల్ అండర్‌వాటర్ ఫైట్ సీక్వెన్స్
-డూప్ లేకుండా రెండు రోజుల్లో 20 గంటల పాటు చిత్రీకరణ
-తన కెరీర్‌లోనే ఇది అత్యంత సవాలుతో కూడిన పని అన్న నటి
-గిరిజన యువతి పాత్రలో యాక్షన్ థ్రిల్లర్‌తో రానున్న రష్మిక



ప్రముఖ కథానాయిక రష్మిక మందన్న తన తదుపరి చిత్రం ‘మైసా’ కోసం ఒక అరుదైన సాహసాన్ని ప్రదర్శించారు. భారతీయ చలనచిత్ర చరిత్రలో తొలిసారిగా ఒక కథానాయిక నీటి అడుగున భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను పూర్తి చేయడం విశేషం. ఈ ఉత్కంఠభరిత ఘట్టాన్ని ఎటువంటి డూప్ సహాయం తీసుకోకుండా రష్మిక స్వయంగా పూర్తిచేయడం గమనార్హం. ఈ విషయాన్ని తెలియజేస్తూ రష్మిక గురువారం సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికర పోస్ట్‌ను పంచుకున్నారు. “నా కెరీర్‌లో ఇంతకంటే సవాలుతో కూడిన పని ఇప్పటివరకు చేయలేదు. ఈ చిత్రం కోసం మేం ఎంతో శ్రమిస్తున్నాం, ఇదే నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది” అని పేర్కొంటూ స్విమ్మింగ్ పూల్‌లో ఉన్న ఒక చిత్రాన్ని షేర్ చేశారు. రెండు రోజుల వ్యవధిలో దాదాపు 20 గంటల పాటు నీటి అడుగున ఈ హై-ఇంటెన్సిటీ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించినట్లు చిత్ర బృందం వెల్లడించింది. రవీంద్ర పుల్ల దర్శకత్వంలో ‘మైసా’ చిత్రం ఒక ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. గిరిజన నేపథ్యంతో సాగే ఈ కథలో రష్మిక ఒక గోండు గిరిజన యువతిగా అత్యంత శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. “భారతీయ యాక్షన్ సినిమాలలో ఇది ఒక నూతన అధ్యాయం” అని చిత్ర నిర్మాణ సంస్థ అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పేర్కొంది. ఈ విశిష్ట పాత్ర కోసం రష్మిక బ్యాంకాక్‌లో ప్రత్యేకంగా స్టంట్ శిక్షణ కూడా పొందారు. ఈ సినిమా టీజర్ అప్‌డేట్‌ను త్వరలోనే వెల్లడించనున్నట్లు, ఈ ఏడాదే చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

# అఖిల్ ‘లెనిన్’.. శ్రీలీల స్థానంలో భాగ్యశ్రీ రావడానికి అసలు కారణం చెప్పిన నిర్మాత నాగవంశీ



-అఖిల్ ‘లెనిన్’ నుంచి శ్రీలీలను తప్పించడంపై వీడిన సస్పెన్స్
-డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్లే మార్చామన్న నిర్మాత నాగవంశీ
-శ్రీలీల స్థానంలో వచ్చిన భాగ్యశ్రీ నటనకు ప్రశంసల వెల్లువ
-భాగ్యశ్రీ కెరీర్‌కు కీలకంగా మారిన ‘లెనిన్’ చిత్రం
-రేపు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న సినిమా

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన ‘లెనిన్’ చిత్రం విడుదలకు సిద్ధమైంది. రేపు (జులై 10న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అయితే, ఈ ప్రాజెక్ట్ మొదలైనప్పుడు హీరోయిన్‌గా శ్రీలీలను ప్రకటించి, ఆ తర్వాత ఆమె స్థానంలో భాగ్యశ్రీ బోర్సేను తీసుకోవడంపై అనేక ఊహాగానాలు చెలరేగాయి. ఈ పుకార్లకు చెక్ పెడుతూ, హీరోయిన్ మార్పు వెనుక అసలు కారణాన్ని నిర్మాత నాగవంశీ తాజాగా వెల్లడించారు. ఓ ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ.. శ్రీలీలను తప్పించడం వెనుక ఎలాంటి వివాదాలు లేవని, కేవలం డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్లే ఈ మార్పు జరిగిందని స్పష్టం చేశారు. “కథకు సంబంధించిన క్రియేటివ్ చర్చల వల్ల మా వైపు నుంచే కొంత ఆలస్యం జరిగింది. మేము షూటింగ్ ప్లాన్ చేసుకునే సమయానికి శ్రీలీల ఇచ్చిన డేట్స్ అందుబాటులో లేవు. ఆ తర్వాత ఆమెకు కార్తీక్ ఆర్యన్ సినిమా, ‘పరాశక్తి’ వంటి పెద్ద ప్రాజెక్టులు వచ్చాయి. మళ్లీ మేము షూటింగ్‌కు సిద్ధమయ్యేసరికి, ఆమె ఆ సినిమాలతో బిజీగా ఉండటంతో డేట్స్ క్లాష్ అయ్యాయి. ఆమెను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక, ఇరు పక్షాల అంగీకారంతోనే హీరోయిన్‌ను మార్చాల్సి వచ్చింది. ఇందులో శ్రీలీల పొరపాటు ఏమీ లేదు” అని నాగవంశీ వివరించారు. హీరోయిన్ మార్పుతో కొంత భాగం రీషూట్ చేయాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. అయితే, సినిమా ఫైనల్ కాపీ చూశాక, ఈ పాత్ర కోసమే భాగ్యశ్రీ పుట్టిందా అన్నంత అద్భుతంగా నటించిందని నాగవంశీ ప్రశంసించారు. ఇదే విషయంపై అక్కినేని నాగార్జున సైతం స్పందిస్తూ.. “భాగ్యశ్రీ నటన అమోఘం. ఆమె కోసం ఎన్ని యుద్ధాలైనా చేయొచ్చు అనిపించింది” అని కొనియాడారు. ‘మిస్టర్ బచ్చన్’ చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన భాగ్యశ్రీ బోర్సే, గ్లామర్‌తో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. అయితే, ఆమెకు ఇప్పటివరకు సరైన కమర్షియల్ హిట్ పడలేదు. ఈ నేపథ్యంలో ‘లెనిన్’ విజయం అఖిల్‌తో పాటు భాగ్యశ్రీ కెరీర్‌కు కూడా ఎంతో కీలకంగా మారింది. ప్రస్తుతం సినిమాపై ఇండస్ట్రీలో పాజిటివ్ బజ్ నడుస్తుండటంతో, ఈ చిత్రంతో ఇద్దరూ భారీ విజయాన్ని అందుకుంటారని అక్కినేని అభిమానులు ఆశిస్తున్నారు.



# సెన్సార్ అడ్డంకులు దాటిన ‘జన నాయగన్’ జూలై 24న విజయ్ సినిమా?

తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ చివరి చిత్రం ‘జన నాయగన్’ విడుదలకు ఎదురైన ప్రధాన ఆటంకాలు తొలగిపోయాయి. పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం తాజాగా సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఈ సినిమాకు ‘ఏ’ సర్టిఫికెట్ జారీ చేయడంతో, విడుదలకు మార్గం సుగమమైంది. ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా నిడివి 183 నిమిషాలుగా (3 గంటల 3 నిమిషాలు) ఖరారైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటించగా, మమితా బైజు, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమైన ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. జూలై 24న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. నిజానికి ఈ సినిమాను 2026 జనవరి 9న సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని తొలుత భావించారు. అయితే, సెన్సార్ సమస్యలు, న్యాయపరమైన చిక్కులు, సీబీఎఫ్‌సీ రివైజింగ్ కమిటీ సమీక్ష వంటి కారణాల వల్ల విడుదల వాయిదా పడుతూ వచ్చింది. చిత్రంలో కొన్ని మార్పుల చేసిన అనంతరం బోర్డు ఈ సినిమాకు ‘ఏ’ రేటింగ్ కేటాయించినట్లు సమాచారం.



# ‘ప్రీతమ్ అండ్ పెడ్రో’ (జియో హాట్ స్టార్) సిరీస్ రివ్యూ!

మొదటి నుంచి కూడా ఓటీటీ సెంటర్లలో థ్రిల్లర్ జోనర్ తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. ఈ వరుసలో క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ లకు విశేషమైన ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ ఒకటి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హిందీలో రూపొందిన ఆ సిరీస్ పేరే ‘ప్రీతమ్ అండ్ పెడ్రో’. వీర్ హిరానీ .. అర్షద్ వార్సీ .. విక్రాంత్ మస్సే ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ కి, రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వం వహించాడు. ఈ నెల 3వ తేదీ నుంచి ఈ సిరీస్ ‘జియో హాట్ స్టార్’లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రీతమ్ (వీర్ హిరానీ) ‘గోవా’లో తన తాతయ్యతో కలిసి నివసిస్తుంటాడు. వాక్యూమ్ క్లీనర్స్ సేల్స్ మేన్ గా పనిచేస్తుంటాడు. తన తాతయ్య ఎంతో ప్రేమగా చూసుకునే పాత టేప్ రికార్డర్ .. అందులో తన నాయనమ్మ పాడిన పాట కేసెట్ ను ఎవరో కాజేస్తారు. ఆ విషయమై పోలీస్ స్టేషన్ కి ఫిర్యాదు చేయడానికి వెళతాడు ప్రీతమ్. ఆ సమయంలో ఒక ‘లావీ దొంగతనం కేసులో పోలీస్ ఆఫీసర్ పెడ్రో (అర్షద్ వార్సీ) బిజీగా ఉంటాడు. టెక్ జీనియస్ అయిన ప్రీతమ్, ఆ కేసు విషయంలో అతనికి సహకారించి దొంగలను పట్టిస్తాడు. అప్పటి నుంచి ప్రీతమ్ పట్ల పెడ్రో స్నేహ భావంతో ఉంటాడు. అదే సమయంలో ఒక కేసు విషయంలో స్పోర్ట్స్ మినిష్టర్ కి కోపాన్ని తెప్పించినందుకు ఫలితంగా, ‘పెడ్రో’ను క్రైమ్ డిపార్టుమెంట్ నుంచి సైబర్ సెల్ కి బదిలీ చేస్తారు. ఏ మాత్రం అనుభవం లేని పెడ్రో, ఈ విషయంలో తనకి సహకరించమని ప్రీతమ్ ను కోరతాడు. అలా చేస్తే అతని తాతయ్య టేప్ రికార్డర్ ను తాను కనిపెడతానని మాట ఇస్తాడు. అందుకు ప్రీతమ్ అంగీకరిస్తాడు. స్పోర్ట్స్ మినిష్టర్ పదేళ్ల కొడుకు వినీత్ కిడ్నాప్ కి గురవుతాడు. తనకి 5 కోట్ల రూపాయలు ఇస్తే, వినీత్ ను వదిలేస్తానని కిడ్నాపర్ హెచ్చరిస్తాడు. ఈ కేసును ఛేదించి మినిష్టర్ దగ్గర మార్కులు కొట్టేసి, మళ్లీ క్రైమ్ డిపార్మెంట్ కి వెళ్లిపోవాలనే ఆలోచనలో పెడ్రో ఉంటాడు. అతనికి సహకరించడానికి ప్రీతమ్ కూడా రంగంలోకి దిగుతాడు. కిడ్నాపర్ వెనుక ఒక జీనియస్ హ్యాకర్ ఉన్నాడనే విషయం ప్రీతమ్ కి అర్థమవుతుంది. అదే సమయంలో ప్రీతమ్ వైపు నుంచి తనకి తెలియని ఫ్లాష్ బ్యాక్ ఏదో ఉందనే సంగతిని పెడ్రో కనిపెడతాడు. అయితే పెడ్రో జీవితంలోను ఒక విషాదకరమైన సంఘటన జరుగుతుంది. ఆ సంఘటనను మరిచిపోవడానికి ప్రయత్నిస్తూనే అతను తన డ్యూటీ చేసుకు వెళుతుంటాడు. అతణ్ణి అంతగా కలిచివేస్తున్న ఆ సంఘటన ఏమిటి? వినీత్ ను కిడ్నాప్ చేసింది ఎవరు? ఆ కిడ్నాప్ వెనకున్న హ్యాకర్ ఎవరు? ఆ హ్యాకర్ కీ .. ప్రీతమ్ కి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? టెక్ జీనియస్ అయిన ప్రీతమ్, చిన్నపాటి జాబ్ ఎందుకు చేస్తున్నట్టు? ప్రీతమ్ ఫ్లాష్ బ్యాక్ కీ .. వినీత్ కిడ్నాప్ కి ఉన్న సంబంధం ఎలాంటిది? అనేది మిగతా కథ. ఒక మినిష్టర్ కొడుకు కిడ్నాప్ అవుతాడు. సైబర్ సెల్ కి సంబంధించి ఆ కేసును పరిష్కరించడానికి పెడ్రో రంగంలోకి దిగుతాడు. ఆ కుర్రాడిని కాపాడటానికి పెడ్రోకి సహకరిస్తుంటాడు ప్రీతమ్. ఆ కుర్రాడు ఒక హ్యాకర్ చేతిలో బందీగా ఉంటాడు. ప్రీతమ్ పై ఆ హ్యాకర్ ప్రతీకారంతో ఉంటాడు. అందుకు గల కారణాలు ఏమై ఉంటాయనే సందేహాలను ఆడియన్స్ లో రేకెత్తిస్తూ ఈ కథ ముందుకు వెళుతుంటుంది. ప్రతీకారంతో ఒక హ్యాకర్ .. పశ్చాత్తాపంతో మరో హ్యాకర్ ఉంటాడు. వారి గతం గురించి ఏ మాత్రం తెలియని పోలీస్ ఆఫీసర్ పెడ్రో, ఇద్దరి మధ్యా ఉంటాడు. ఈ మూడు ప్రధానమైన పాత్రల చుట్టూనే ఈ కథ పరిగెడుతూ ఉంటుంది. ప్రస్తుతం నడుస్తున్న కథతో పాటు, సందర్భాన్ని బట్టి వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ కూడా చాలా ఆసక్తికరంగా నడుస్తాయి. సీరియస్ నెస్ ఎక్కడా మిస్సవ్వకుండా చూసుకుంటూనే కామెడీ టచ్ ఇచ్చిన విధానం బాగుంది. తొందరపాటు తనంతో చేసే కొన్ని పనులు, అవతలివారికి ఒక జీవితకాలానికి సరిపడా నష్టాన్ని కలిగిస్తాయి. బాధితులలో నుంచి ఒక శత్రువు పుట్టుకొస్తే .. ఆ శత్రువు నీడలా వెంటాడం మొదలు పెడితే .. అతనికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై మంచి పట్టు ఉంటే ఏం జరుగుతుంది? అనే అంశాన్ని ప్రధానంగా తీసుకుని దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు. కాగితంపై తాను రాసుకున్న సన్నివేశాలను అంతే గొప్పగా తెరపై ఆవిష్కరించగలిగాడు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం .. దానిని ఒళ్లంతా నింపుకున్న స్మార్ట్ ఫోన్ మనుషుల జీవితాలను ప్రభావితం చేస్తోంది. ఎంతో ఉపయోగకరమైనదైన స్మార్ట్ ఫోన్, అంతే ప్రమాదకారిగాను మారిపోయింది. స్మార్ట్ ఫోన్ ఆధారంగా సాధించలేనిది లేదు అన్నట్టుగా నేరగాళ్లు వాటిని తమ ఆయుధాలుగా మార్చుకుని, చిన్న పిల్లల మొదలు పెద్దల వరకూ ఎలా ప్రమాదాలలోకి నెడుతున్నాయనేది చూపించిన తీరు బాగుంది. ఒక ఎపిసోడ్ కి మించి మరొక ఎపిసోడ్ ఉత్కంఠను రేకెత్తిస్తుంది. ఎక్కడా లూజ్ సీన్స్ అనేవి కనిపించవు. స్క్రీన్ ప్లే చాలా బలంగా కనిపిస్తుంది. కథలో ఏ సన్నివేశం చూస్తున్నాఏ పాత్రను పరిశీలించినా సహజత్వానికి చాలా దగ్గరగా ఆవిష్కరించిన తీరు ప్రశంసనీయంగా అనిపిస్తుంది. మన కళ్లముందు నిజమైన ఇన్వెస్టిగేషన్ జరుగుతున్న భావన కలుగుతుంది. ప్రతి ఆర్టిస్ట్ నటన ఆకట్టుకుంటుంది.




Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143